హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర: 72

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.136	220	240
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.130	180	200

ఉష్ణోగ్రత గరిష్ఠం 27.0 । కనిష్ఠం 15.8



జిల్లాకేంద్రంలోని రామాలయంలో ప్రత్యేక అలంకారంలో స్వామివారు

జిల్లాకేంద్రంలోని రామాలయంలో ఏకాదశి వేడుకల్లో పాల్గొన్న జిల్లా జడ్జి నాగరాజు దంపతులు, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి దంపతులు

కన్నులారా నిన్నుకాంచి

- గుట్టలో ఉగ్రనారసింహుని ఉత్తర ద్వార దర్శనం
- ముక్కోటికి తరలివచ్చిన భక్తజనం
- యాదగిరిగుట్టలో అధ్యయనోత్సవాలకు శ్రీకారం
- జిల్లావ్యాప్తంగా ముక్కోటి వేడుకలు
- భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు
- ఉదయం నుంచే భక్తుల పూజలు

6,8

ముక్కోటి ఏకాదశి వేడుకలు జిల్లావ్యాప్తంగా వైభవంగా కొనసాగాయి. ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. జిల్లాకేంద్రంలోని రామాలయంలో స్వామివారి ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. జిల్లా జడ్జి నాగరాజు దంపతులు, నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రిశ్రీనివాస్‌రెడ్డి దంపతులు, ప్రత్యేకంగా హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

తెల్లారిన బతుకులు

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

బస్సులో ఒడిషా, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల వలస కూలీలు

నిద్రమత్తులోనే ఐదుగురు మృత్యు ఒడిలోకి

10 మందికి గాయాలు, ఇద్దరి పరిస్థితి విషమం





సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

రాష్ట్రం దాటి జీవనోపాధి కోసం వలస వస్తున్న కూలీలు మార్గమధ్యలోనే మృత్యువాత పడ్డారు. కూలినాలి చేసుకుని పొట్టపోసుకునే ఒడిషా రాష్ట్రానికి చెందిన కూలీలు రెండు నెలల కిందట సొంత ప్రాంతాలకు వెళ్లారు. అక్కడ నుంచి తిరిగి వస్తుండగా విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి(65) చివ్వెంల మండలం ఐలాపురం వద్ద ఆగి ఉన్న లారీని కూలీలు ప్రయాణిస్తున్న బస్సు ఢీకొట్టడంతో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు. తెల్లవారుజాము కావడంతో నిద్రలో ఉన్న కూలీలు ఆ నిద్రలోనే మృత్యుఒడికి చేరారు. మృతుల్లో భార్యాభర్తలు ఉన్నారు. 10 మంది గాయపడగా, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం ఐదుగురి ప్రాణాలను బలితీసుకుంది. మంచుకురుస్తుండటం, ప్రైవేట్ బస్సు వేగంగా ఉండటంతో లారీ ఆగి ఉన్న విషయాన్ని గమనించకపోవడంతోనే ప్రమాదం చోటుచేసుకుందని భావిస్తున్నారు.

వివరాలు 7లో


టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికకు



- పులి సరోత్తమ్‌రెడ్డిని ప్రకటించిన బీజేపీ
- ఇప్పటికే దూకుడులో యూటీఎఫ్ అభ్యర్థి నర్సిరెడ్డి
- కాంగ్రెస్, బీఆర్ఎస్ వైఖరిపై స్పష్టత కరువు



సరోత్తమ్‌రెడ్డి



నర్సిరెడ్డి

శాసనమండలి నల్లగొండ-వరంగల్-ఖమ్మం ఉపాధ్యాయ నియోజవర్గ ఎన్నికల్లో బలమైన పోటీకి రంగం సిద్ధమవుతోంది. ఉపాధ్యాయ సంఘాలు ప్రత్యక్షంగా, రాజకీయ పార్టీలు పరోక్షంగా ఈ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న సంకేతాలు వెలువడుతున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పదవీకాలం మార్చి 29తో ముగియనుండడంతో ఈలోగా కొత్త ఎమ్మెల్సీగా ఎన్నుకునేందుకు ఎన్నికల సంఘం ప్రక్రియను ఇప్పటికే మొదలుపెట్టి, ఓటర్ల నమోదు ప్రక్రియను పూర్తిచేసింది. ఫిబ్రవరిలో ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉండగా అందరూ తమ కార్యాచరణను ప్రారంభించారు.

(ఆంధ్రజ్యోతిప్రతినిధి- నల్లగొండ)

రాష్ట్రంలో చైతన్యవంతమైన ప్రాంతంగా పేరున్న వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉమ్మడి జిల్లాల్లో విస్తరించిన ఈ ఉపాధ్యాయ నియోజకవర్గంలో గెలవడం ద్వారా తమ సత్తాను చాటాలని ప్రధాన ఉపాధ్యాయసంఘాలు భావిస్తున్నాయి. ఈ ఎన్నికను సవాల్‌గా తీసుకొని ఆయా సంఘాలు అభ్యర్థుల ఎంపిక, క్షేత్రస్థాయి ప్రచారం నిర్వహిస్తున్నాయి. ఈస్థానాన్ని తిరిగి గెలవడం ద్వారా ఉపాధ్యాయుల్లో తమపట్టుని కొనసాగించాలని యూటీఎఫ్ రంగంలోకి దిగితే, ఈసారి ఈ సీటులో గెలవడం ద్వారా తిరిగి పునర్ వైభవం సాధించాలని పీఆర్‌టీయూటీఎస్ పావులు కదుపుతోంది. ఉపాధ్యాయ సమస్యలే లక్ష్యంగా ఏర్పాటైన తమ సంఘం అభ్యర్థిని గెలిపించుకోవడం ద్వారా ప్రభుత్వానికి దగ్గరిదారి ఏర్పడుతుందని టీజీపీఆర్‌టీయూ ప్రచారం మొదలుపెట్టింది. ఉపాధ్యాయసంఘాలంటే కొన్నివర్గాలకే పరిమితం కాదని, ఉపాధ్యాయులందరి సమస్యలకోసం తమ పార్టీ పనిచేస్తుందని, తమ పార్టీ అభ్యర్థికి మద్దతిచ్చి ఉపాధ్యాయులు గెలిపించాలని బీజేపీ ప్రకటిస్తోంది. పార్టీ తరఫున అభ్యర్థిని అధికారికంగా ప్రకటించడంతో ఈ స్థానంపై ఆ పార్టీ దృష్టిసారించిన విషయాన్ని తెలియజేస్తోంది.

బీజేపీ అభ్యర్థిగా పులి సరోత్తమ్‌రెడ్డి

బీజేపీ తన అభ్యర్థిగా హన్మకొండ జిల్లాకు చెందిన పులి సరోత్తమ్‌రెడ్డిని ప్రకటించింది. ఈమేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి శుక్రవారం అభ్యర్థిత్వాన్ని అధికారికంగా వెల్లడించారు. ఈయన స్కూల్ అసిస్టెంట్‌గా ఉపాధ్యాయవృత్తిలోకి ప్రవేశించి పదేళ్లపాటు ప్రధానోపాధ్యాయుడిగానూ పనిచేశారు. పీఆర్‌టీయూలో కొన్నేళ్లపాటు క్రియాశీలకంగా వ్యవహరించారు. సంఘంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా, రాష్ట్ర అధ్యక్షుడిగానూ వ్యవహరించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఏర్పాటైన ఉపాధ్యాయ జేఏసీలో క్రియాశీలకంగా..

మిగతా 6వ పేజీలో..

ఖాకీ అవినీతి కలకలం !

- సోషల్‌మీడియాలో చక్కర్లు
- సిబ్బంది వద్ద అప్పులు చేసి ఇవ్వడం లేదనే ఆరోపణలు
- శాఖాపరమైన విచారణ నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం



నల్లగొండ, జనవరి 10 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఒక సీనియర్ పోలీస్ అధికారిపై వస్తోన్న ఆరోపణలు కలకలం సృష్టిస్తున్నాయి. కీలకమైన బాధ్యతల్లో ఉన్న అధికారి అడ్డగోలు వ్యవహారశైలిపై తీవ్రస్థాయిలో సొంత శాఖ సిబ్బంది నుంచే విమర్శలొస్తున్నాయి. ఏడేళ్లుగా జిల్లాలో కీలకమైన పోస్టులో తిష్టవేసిన సదరు ఖాకీ ఆఫీసర్ ఏకంగా తనకు అనుకూలమైన బృందాన్ని ఏర్పాటు చేసుకొని భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారనే బలమైన ఆరోపణలతో పోలీస్ ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈ అవినీతి పోలీస్ అధికారిపై ఒక బాధితుడిపేరుతో ఏకంగా ఎనిమిది పేజీల లేఖ సోషల్‌మీడియాలో వైరల్ అవుతుండడం సంచలనం సృష్టిస్తోంది.

సిబ్బందితో వసూళ్లనే ఫిర్యాదులు

ఏడేళ్లుగా జిల్లాలో పనిచేస్తున్న సదరు అధికారి సిబ్బందినే తన బృందంగా ఏర్పాటు చేసుకొని వసూళ్లు చేశారనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రధానంగా పోలీస్‌శాఖలో సిబ్బంది నుంచి ప్రైవేట్ లోన్లు తీసుకొని ఇవ్వకపోవడం వంటి ఆరోపణలు బలంగా వినిపిస్తుండగా, సిబ్బందిపై ఫిర్యాదులున్నాయని పేర్కొంటూ వసూళ్లు చేశారని చెబుతున్నారు. నిత్యావసర వస్తువులు మొదలుకొని హోటల్‌లో వినియోగించే సామగ్రి వరకు సిబ్బంది ద్వారా వసూళ్లు చేసేవారనే ఆరోపణలు చేస్తున్నారు. ఇద్దరు కానిస్టేబుళ్లను కేవలం తన సొంత పనుల నిర్వహణకే వినియోగించుకుంటున్నారని, అదేవిధంగా మరో కానిస్టేబుల్, ఏఎస్ఐతో..

మిగతా 7వ పేజీలో..

మొదలైన సంక్రాంతి రద్దీ

- పట్టణాల నుంచి పల్లెలకు పయనం
- ఉమ్మడి జిల్లాలో వాహనాల సందడి
- బస్టాండ్లు కిటకిట



6 పంతంగి టోల్‌గేట్ వద్ద వాహనాల రద్దీ



భువనగిరి బస్టాండ్‌లో పాఠశాలల నుంచి ఇంటికి బయలుదేరిన చిన్నారితో ఆమె తల్లి

ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని జాతీయ రహదారిపై సంక్రాంతి సందడి మొదలైంది. వరుస సెలవు దినాలు కావడంతో పట్టణాల నుంచి పల్లెలకు ప్రజలు పయనమయ్యారు. హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాలకు బయలుదేరిన వారితో శుక్రవారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రహదారులపై వాహనాల రద్దీ నెలకొంది. చౌటుప్పల్ పట్టణంలోని 65వ నెంబరు జాతీయ రహదారిపై వాహనాల రద్దీ ప్రారంభమైంది. ఈ రద్దీ ఈ నెల 13 వరకు కొనసాగనుంది. చౌటుప్పల్‌లో సుమారు రెండు కిలోమీటర్ల పొడవున ఉన్న జాతీయ రహదారిపై వాహనాలు నెమ్మదిగా కదులుతూ వెళ్లాయి.

రాజకీయంగా చైతన్యవంతం కావాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

నాగార్జునసాగర్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): గిరిజనులు, ఆదివాసీలు ఆర్థికంగా, రాజకీయంగా చైతన్యవంతులు కావాలని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో నిర్వహిస్తున్న అఖిల భారత ఆదివాసీ కాంగ్రెస్ ప్రతినిధుల శిక్షణ తరగతుల్లో శుక్రవారం మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజన, ఆదివాసీల కోసం అనేక సంక్షేమ పథకాలు, చట్టాలు తీసుకొచ్చిందన్నారు. ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, మునినాయక్, పాండునాయక్, సక్రునాయక్, నరేందర్‌నాయక్, స్వామినాయక్, చందునాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సాగర్‌కు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి

నాగార్జునసాగర్‌లో నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క హాజరుకానున్నారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి హెలికాప్టర్‌లో శనివారం సాగర్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగిస్తారు. డిప్యూటీ సీఎం, మంత్రుల పర్యటనను విజయవంతం చేయాలని ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ కోరారు.

రేపు నల్లగొండలో బీఆర్ఎస్ మహాధర్నా

- మాజీమంత్రి కేటీఆర్ రాక

నల్లగొండ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రైతుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక వైఖరికి నిరసనగా ఈ నెల 12వ తేదీన జిల్లాకేంద్రంలోని గడియారం సెంటర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం నిర్వహించే మహాధర్నాకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్, మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు.

గ్రామస్థులతో సమావేశమై.. పథకాలు తెలుసుకుని..




గ్రామస్థులతో కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి జయరాం

మిర్యాలగూడ రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామంలో కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి జయరాంతోపాటు తెలంగాణ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి కార్యాలయ అధికారులు సెల్వరాజు, నజీర్ శుక్రవారం పర్యటించారు. మాజీ సర్పంచ్ భోగవెల్లి వెంకటరమణచౌదరితో కలిసి గ్రామస్థాయి ఉద్యోగులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులతో సమావేశం నిర్వహించారు. స్వచ్ఛభారత్ నిర్వహణ, తడి, పొడిచెత్త నుంచి ఎరువుల తయారీ విధానం, వంటి అంశాల అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌బీఎం ప్రతినిధి మోహిద్, కార్యదర్శి భద్రయ్య ఉన్నారు.



సీఎం సమీక్షలో జిల్లా కలెక్టర్

సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి



కన్నులారా నిన్ను కాంచి..

● వైభవంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు ● స్వామి వారి దర్శనంతో పులకించిన భక్తులు ● కిక్కిరిసిన ఆలయాలు

మంచుతెమ్మెరలు ఒకవైపు.. స్వామివారి కోసం ఎదురుచూస్తున్న దూపదీపాలు మరోవైపు... పూలవనాన్ని తలపించే ద్వారాల అలంకరణ మధ్య... అగరొత్తుల పొగలతో ఆ మహావిష్ణువు ఉత్తర ద్వార దర్శనం కనువిందు చేసింది. తనివితీరా చూసేందుకు భక్తులు గంటల కొద్దీ వేచిఉన్నారు.

మహావిష్ణువే భక్తుడిని కరుణించి వేంచేసిన తరుణం రమణీయం, కమనీయం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ముక్కోటి ఏకాదశి పర్వదిన వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య జరిగాయి. తెల్ల వారుజాము నాలుగుగంటల నుంచే స్వామి దర్శనం కోసం భక్తులు ఎదురుచూశారు. మంగళహారతులతో స్వామివారిని మహిళలు ఆరాధించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ప్రాంగణాల్లో ఆధ్యాత్మిక శోభ మరింత ద్విగుణీకృతమైంది. యాదాద్రిభువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహస్వామి కొండ ప్రముఖులతో నిండిపోయింది. సూర్యాపేట జిల్లాలోని మట్టపల్లి లక్ష్మీనృసింహస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. నల్లగొండ జిల్లా కేంద్రంలోని రామాలయంలో పెద్దసంఖ్యలో తరలిచ్చిన భక్తుల నడుమ సీతారాముల మూర్తులను ఘనంగా ఊరేగించారు.



భువనగిరి అర్బన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి, పాతగుట్ట ఆలయాల్లో శుక్రవారం ముక్కోటి(వైకుంఠ) ఏకాదశి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఉభయఆలయాల్లో ఉత్తర ద్వారంలో భక్తులకు స్వామి వారు దివ్యదర్శనమిచ్చారు. విశేష అలంకరణలో ఆలయ వైకుంఠద్వారంలో స్వామి వారి దర్శించుకుని భక్తులు పరవశించారు. ప్రధానాలయంలో తెల్లవారుజామున 5.28 గంటలకు, పాతగుట్ట ఆలయంలో 6.42 గంటలకు వైకుంఠ ద్వార దర్శనమివ్వగా భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. పట్టువస్త్రాలు, ముత్యాలు, వజ్ర వైడూర్యాలు పొదిగిన స్వర్ణాభరణాలతో అలంకరించిన లక్ష్మీనృసింహుడు గరుడవాహనంపై ప్రత్యేకంగా ఏర్పరచిన వేదికపై వేంచేశారు. ఆలయ ప్రధానార్చకులు నల్లందీఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాందూరి వెంకటాచార్యులు ఆధ్వ ర్యంలో అర్చక బృందం పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

● యాదగిరిగుట్ట, పాతగుట్ట ఆలయాల్లో అధ్యయనోత్స వాలు శుక్రవారం స్వస్తివాచనంతో శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ఉదయం గరుడ వాహనంపై, సాయంత్రం మత్స్యావతారంలో స్వామివారు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాశస్త్యాన్ని పెంచేం దుకు సంగీత, సాహిత్య కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, యాదాద్రి జిల్లా కలెక్టర్ ఎం.హనుమంతరావు, భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి ఏ.భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నర్సింహమూర్తి, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవోలు గజ్వేల్లి రమేష్‌బాబు, దూశెట్టి కృష్ణ, రఘు, రాజన్‌బాబు పాల్గొన్నారు. ఆలయ ఖజానాకు వివిధవిభాగాల ద్వారా రూ. 17,65,927 ఆదాయం సమకూరింది. ఆలయ డైరీని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఆవిష్కరించారు.

లక్ష్మీనృసింహుడిని దర్శించుకున్న ఆస్ట్రేలియా ఎంపీ

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారిని ఆస్ట్రేలియా దేశం విక్టోరియాకు చెందిన ఎంపీ జాన్ ములహి దర్శించుకున్నారు. స్వయంభువుల ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.





యాదగిరిగుట్టలో స్వామి వారి దర్శనం కోసం చిన్నారులను ఎత్తుకున్న కుటుంబ సభ్యులు

నల్లగొండ రామాలయంలో

నల్లగొండ కల్చరల్ : ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా నల్లగొండ జిల్లా కేంద్రంలోని రామాలయం భక్తజనసంద్రమైంది. తెల్లవారు జామునుంచే స్వామివారు ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారి దర్శనానికి భక్తులు పోటీపడ్డారు. భక్తులు పెద్దసంఖ్యలో రావడంతో ఆలయం సందడిగా మారింది. క్యూలైన్లలో గంటల తరబడి నిలబడి స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో స్వామివారిని ఆశీనులను చేసి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. జిల్లా జడ్జి నాగరాజు దంపతులు, మునిసిపల్ చైర్మన్ బుర్రిశ్రీనివాస్‌రెడ్డి దంపతులు, ప్రత్యేకంగా హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. వికాసతరంగిణి ఆధ్వర్యంలో శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం చేశారు. విద్యుత్ దీపాలతో దేదీప్యమానంగా వెలిగింది. ఈకార్యక్రమంలో దేవాదాయ శాఖ ఏసీ కే భాస్కర్, ఆలయం ఈవో జయరామయ్య, అనిల్‌రెడ్డి, అర్చక స్వాములు పాల్గొన్నారు.



నల్లగొండ రామాలయం వద్ద స్వామి వారి ఉత్తర ద్వార దర్శనం

మఠంపల్లి : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లిలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో ఉత్తర ద్వారదర్శనం కన్నులపండువగా సాగింది. వేడుకలకు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు రాష్ట్రం నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఐదు గంటలకు స్వామి వారు దర్శనమిచ్చారు. అనంతరం స్వామి వారిని పురవీధుల్లో ఊరేగించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు, ఎస్‌ఐ వీ బాబు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లి, విజయ్‌కుమార్ ఈవో నవీన్ పాల్గొన్నారు.







యాదగిరిగుట్టలో నమస్కరిస్తున్న భక్తులు

భువనగిరి ఖిల్లాపై ఆటవిడుపు



భువనగిరి టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సెలవులకు ఒకరోజు ముందుగానే విద్యార్థుల సందడి ప్రారంభమైంది. హైదరాబాద్ నగరానికి చెందిన పలు పాఠశాలల విద్యార్థులు శుక్రవారం యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలోని భువనగిరి ఖిల్లాపైకి తరలివచ్చారు. ఆటవిడుపుగా సాహసక్రీడలైన జిప్‌లైన్ గేమ్, రాక్ క్లైంబింగ్ చేశారు. రోజంతా ఖిల్లాపైనే ఆటాపాటలతో గడిపారు. దీంతో ఖిల్లా ప్రాంతం సందడిగా కనిపించింది. గ్రూప్ ఫొటోలు దిగుతూ ఉత్సాహంతో తిరిగెళ్లారు.





మొదలైంది సంక్రాంతి సందడి



చౌటుప్పల్ పట్టణంలో విజయవాడ వైపు వాహనాల రద్దీ,





సూర్యాపేటలోని కిడ్‌జీ స్కూల్‌లో చిన్నారులకు భోగిపండ్ల కార్యక్రమం, భువనగిరి బస్టాండ్‌లో బస్సు వద్ద కిక్కిరిసిన ప్రయాణికులు

(ఆంధ్రజ్యోతి-చౌటుప్పల్ టౌన్, రూరల్, కేతేపల్లి)

ఉమ్మడి జిల్లాలో సంక్రాంతి పండుగ సందడి మొదలైంది. రేపటి నుంచి పాఠశాలలకు సెలవులు ఉండటంతో విద్యార్థులు ఇంటిముఖం పట్టారు. దీంతో అటు బస్టాండ్లలో, హైదరాబాద్‌లో స్థిరపడ్డ ఉమ్మడి జిల్లాకు చెందిన వారితో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారు స్వస్థలాలకు చేరుతుండటంతో జాతీయ రహదారులపై రద్దీ మొదలైంది.

జాతీయ రహదారులపై రద్దీ

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం వద్ద మొదలయ్యే హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారి(65) నల్లగొండ జిల్లా మీదుగా సూర్యాపేట జిల్లా లోని కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద ముగుస్తుంది. సుమారు 151 కిలోమీటర్ల దూరం ఉన్న ఈ రహదారి గుండానే ఉమ్మడి జిల్లాకు చెందిన వారితో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారూ ప్రయాణిస్తుండటంతో రద్దీ మొదలైంది. శుక్రవారం ఉదయం అంతంత మాత్రంగా ఉన్న వాహనాల రాక, సాయంత్రానికి ఊపందుకుంది. చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేట్ వద్ద రోజు వారీగా 35వేల వాహనాల వరకు రాకపోకలు సాగిస్తుండగా శుక్రవారం అదనంగా 8000 వాహనాలు అదనంగా రాకపోకలు సాగించినట్లు నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ టోల్‌గేట్ వద్ద సాధారణ రోజుల్లో 12వేల నుంచి 13వేల వాహనాలు ప్రయాణిస్తుండగా శుక్రవారం ఇరువైపులా 18వేల వాహనాలు వెళ్లాయి. ట్రాఫిక్ నిలిచిపోకుండా నార్కట్‌పల్లి--అద్దంకి హైవేపై మాడ్గులపల్లి వద్ద పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు.



కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌గేట్ వద్ద వరుసలో నిలిచిన వాహనాలు

పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలు

పాఠశాలలకు పండుగ సెలవులు ఉండటంతో శుక్రవారం పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సంక్రాంతి వైభవాన్ని ప్రతిబింబించేలా రంగ వల్లుల పోటీలు, పతంగుల ఎగిరివేత, గంగిరెద్దుల విన్యాసాలు, పిండివంటలు, చిన్నారులకు భోగిపండ్లు, ఇతరత్రా కార్యక్రమాలు చేపట్టి విద్యార్థులు ఆనందంగా గడిపారు. విద్యాసంస్థల్లో సాంస్కృతిక కార్యక్రమాలు పండుగను తలపించాయి.

బస్టాండ్లలో సందడి

స్వగ్రామాలకు చేరుతున్న విద్యార్థులు, ప్రజలతో బస్టాండ్లు కిక్కిరిసాయి. ముఖ్యంగా భువనగిరి పట్టణంతో పాటు నల్లగొండ, సూర్యాపేట బస్టాండ్లలో సందడి కనిపించింది. బస్సుల్లో సీట్ల కోసం పోటీపడ్డారు. ప్రతీ బస్సు ప్రయాణికులతో నిండుగా వెళ్లింది. మధ్యాహ్నాం నుంచి రాత్రి వరకు బస్టాండ్లలో రద్దీ కనిపించింది. తొందరగా ఇంటికి వెళ్లే ఉత్సాహంతో బస్సు ఎక్కేందుకు కుస్తీలు పడ్డారు.

టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికకు రెడీ

(5వ పేజీ తరువాయి)

వ్యవహరించారు. ఉపాధ్యాయ సమస్యలపై పనిచేస్తూనే బీజేపీలో చేరారు. ఆయన్ను అభ్యర్థిగా ఎంపికచేయడం ద్వారా బీజేపీ బలమైన పోటీకి సిద్ధమైనట్లు తెలుస్తోంది.

యూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి

పస్తుతం ఈ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా ప్రాతినిధ్యం వహిస్తోన్న అలుగుబెల్లి నర్సిరెడ్డి అభ్యర్థిత్వానికి యూటీఎఫ్ అందరికంటే ముందే ప్రకటించడంతో ఆయన, ఆయన తరఫున యూటీఎఫ్ శ్రేణులు ఇప్పటికే ప్రచారం ముమ్మరం చేశాయని చెప్పవచ్చు. నల్లగొండలోనే ఇటీవల యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలు సైతం నిర్వహించి ఆ సంఘం ఉపాధ్యాయుల సమస్యలు, హక్కులు, సంక్షేమంపై తమ పోరాటాలు, విజయాలు, భవిష్యత్ కార్యాచరణను ప్రకటించింది. మండల కమిటీలు మొదలుకొని, జిల్లా కమిటీల వరకు అందరు కార్యవర్గసభ్యులు క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయుల్లో నర్సిరెడ్డికి సానుకూలత వచ్చేలా పనిచేస్తున్నారు.

నలుగురు ప్రధాన అభ్యర్థులదీ పీఆర్‌టీయూ నేపథ్యమే

ఈ ఎన్నికల్లో ఇప్పటికే అభ్యర్థులుగా తెరపైకి వచ్చిన వారిలో సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి యూటీఎఫ్ మద్దతుతో బరిలో ఉన్నారు.పీఆర్‌టీయూ నుంచి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డిని ప్రకటించగా, టీజీపీఆర్‌టీయూ నుంచి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పోటీకి సిద్ధమయ్యారు. మరోవైపు మాజీ ఎమ్మెల్సీ పూలరవీందర్ సైతం పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. తాజాగా బీజేపీ అభ్యర్థిగా పులి సరోత్తమ్‌రెడ్డి బరిలోకి వచ్చారు. వీరితో పాటు మాజీ డీఈవో యేలే చంద్రమోహన్ సైతం పోటీచేస్తున్నట్లు ప్రకటించి ప్రచారం ప్రారంభించారు. ఇప్పటివరకు పోటీలో ఉన్నట్లు ప్రకటించిన కీలకమైన ఆరుగురు అభ్యర్థుల్లో నలుగురిది పీఆర్‌టీయూ నేపథ్యమే. ఈస్థానం నుంచి 2013లో పోటీచేసి గెలుపొందిన పూలరవీందర్ 2019 ఎన్నికల్లో పీఆర్‌టీయూ అభ్యర్థిగానే బరిలో దిగి ఓటమిపాలయ్యారు. ఎమ్మెల్సీగా కొనసాగిన కాలంలో ఆయన అప్పటి అధికార బీఆర్‌ఎస్‌లో చేరారు. తాజాగా ఆయన జాక్టో అభ్యర్థిగా బరిలో నిలుస్తున్నారు. పీఆర్‌టీయూ ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి తాజాగా పీఆర్‌టీయూ అభ్యర్థిగా బరిలోకి వచ్చారు. మరోవైపు ఈ సంఘం నుంచి తెలంగాణ ఉద్యమ సమయంలో చీలిక ఏర్పడి టీపీఆర్‌టీయూని ఏర్పాటుచేసిన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఈస్థానం నుంచి పోటీలో ఉంటున్నట్లు ప్రకటించారు. ఆయన ప్రస్తుతం పీసీసీ అధికార ప్రతినిధిగానూ వ్యవహరిస్తున్నారు. అయితే ఆయనకు కాంగ్రెస్ నుంచి పార్టీ అభ్యర్థిత్వం ప్రకటిస్తుందా..? లేదా..? అనే విషయం తేలాల్సి ఉండగా, హర్షవర్ధన్ అయితే ప్రభుత్వానికి దగ్గరి వ్యక్తిగా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి దగ్గరిదారి ఏర్పడుతుందని సంఘం నాయకులు ప్రచారం చేస్తుండడం గమనార్హం. మరోవైపు తాజాగా బీజేపీ సైతం పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా, ప్రధానకార్యదర్శిగా పనిచేసిన సరోత్తమ్‌రెడ్డినే అభ్యర్థిగా ప్రకటించింది. సంఘంలో క్రియాశీలకపాత్ర వహించిన సరోత్తమ్‌రెడ్డికి ఉపాధ్యాయులతో ఉన్న పరిచయాలతో తమదైన ఎన్నికల మేనేజ్‌మెంట్‌కి బీజేపీ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. పోటీలో ఉన్న ఆరుగురిలో నలుగురు పీఆర్‌టీయూ పూర్వనేపథ్యం గలవారే కావడంతో ఉపాధ్యాయులు ఎటు మొగ్గుతారనే అంశంపై ఆసక్తినెలకొంది.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మద్దతుపై కొరవడిన స్పష్టత

ఈస్థానంలో పోటీచేసే అభ్యర్థిని బీజేపీ అధికారికంగా ప్రకటించింది. పులి సరోత్తమ్‌రెడ్డి ఆపార్టీ తమ అభ్యర్థిగా ప్రకటించడంతో ఆపార్టీ నేరుగా బరిలోకి వస్తోంది. అయితే అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్‌ఎస్ తమ అభ్యర్థుల్ని అధికారికంగా ప్రకటిస్తాయా..? లేక బరిలో ఉన్న అభ్యర్థుల్లో ఎవరికైనా తమ మద్దతుని పరోక్షంగా అందిస్తాయా...? లేక ఈ ఎన్నికలో తలదూర్చకుండా దూరంగా ఉంటాయా..? అనే విషయం తేలాల్సి ఉంది. గత ఎన్నికల్లోనూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన గత ఎన్నికల్లోనూ ఈ రెండు పార్టీలు అధికారికంగా ఎవరికీ మద్ధతివ్వలేదని, ఈసారి కూడా తటస్థ విధానాన్నే కొనసాగిస్తాయనే అభిప్రాయం పార్టీల ముఖ్యనేతల నుంచి వెల్లడవుతోంది. నోటిఫికేషన్ వెలువడి ప్రచారం మొదలైతే కానీ, ఈపార్టీల వైఖరి తేలనుంది.

నియోజకవర్గంలో నమోదయిన ఓటర్లు 24,905 మంది

12 జిల్లాల్లో 191 మండలాల్లో విస్తరించిన ఈ నియోజకవర్గంలో డిసెంబరు 30న ప్రచురించిన తుది పబ్లికేషన్ మేరకు 24,905 మంది ఓటర్లు నమోదయ్యారు. ఈ నియోజకవర్గంలో 200 పోలింగ్ స్టేషన్లను గుర్తించారు. మొత్తం ఓటర్లలో పురుషులు, 14,940 మంది ఉండగా, స్త్రీలు 9,965 మంది నమోదయ్యారు. ఇందులో అత్యధికంగా హనుమకొండ జిల్లాలో 5,098 మంది ఓటర్లుంటే, ఆ తర్వాత నల్లగొండలో 4,483 మంది, ఖమ్మం జిల్లాలో 3,955 మంది ఓటర్లు నమోదయ్యారు. అత్యల్పంగా సిద్ధిపేట జిల్లాలో 163 మంది ఓటర్లుండగా, ఆ తర్వాత భూపాలపల్లిలో 323 మంది, ములుగు జిల్లాలో 612 మంది మాత్రమే ఓటర్లు నమోదయ్యారు. ఈ నియోజకవర్గం ఏర్పాటైన 2007లో స్వాతంత్ర్య సమరయోధుడు, విద్యావేత్త చుక్కారామయ్య గెలుపొందారు. ఆ తర్వాత 2013లో జరిగిన ఎన్నికల్లో పీఆర్‌టీయూ అభ్యర్థిగా బరిలో నిలిచిన పూలరవీందర్ గెలుపొందారు. 2019 ఎన్నికల్లో యూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి విజయం సాధించగా, తాజాగా జరగబోయే ఎన్నికలో నర్సిరెడ్డి, రవీందర్‌తో పాటు కీలకమైన అభ్యర్థులు బరిలోకి వస్తుండడంతో విజయం ఎవరిని వరించనుందనే ఉత్కంఠ నెలకొంది.

నేటి నుంచి పాలేరు బ్రిడ్జిపై

వాహనాల రాకపోకలు

కోదాడ రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కోదాడ మండలం నల్లబండగూడెం పరిధి రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద గల పాలేరు బ్రిడ్జిపై శనివారం నుంచి వాహనాల రాకపోకలు కొనసాగిస్తామని నేషనల్ హైవే మేనేజర్ నాగకృష్ణ తెలిపారు. నాలుగు నెలల కిందట వచ్చిన వరదలకు పాలేరు బ్రిడ్జికి పెద్దఎత్తున గండిపడడంతో తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ఓ వైపు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో మరో బ్రిడ్జి పైనుంచే వాహన రాకపోకలు కొనసాగించారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'నత్తనడకన పాలేరు బ్రిడ్జి గండి నిర్మాణ పనులు' శీర్షికన కథనం ప్రచురితమైంది. గండి పనులు పూర్తికాకపోతే సంక్రాంతికి వాహనాల రద్దీతో వాహనదారులు ఇబ్బందిపడే అంశాన్ని ఎత్తిచూపింది. దీంతో స్పందించిన కాంట్రాక్టర్ రాత్రింబవళ్ళు పనులు నిర్వహించి శనివారం నుంచి బ్రిడ్జిపై రాకపోకలు కొనసాగించేలా ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఇప్పటికే బ్రిడ్జి నిర్మాణ పనులు 80శాతం వరకు పూర్తయ్యింది. మిగతా పనులను సంక్రాంతి పండుగ వాహనాల రద్దీ తగ్గిన తరువాత పూర్తి చేస్తామన్నారు.





హైదరాబాద్‌లో జరిగిన ఫైనల్ పోటీలో ముగ్గులు వేస్తున్న మహిళలు



పోటీలో పాల్గొన్న మహిళలతో సినీనటి వైష్ణవీ చైతన్య

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ రాష్ట్ర స్థాయి ముత్యాల ముగ్గుల పోటీ ఫైనల్స్



ముగ్గు వేస్తున్న సినీ నటి వైష్ణవీ చైతన్య

"ముత్యాల ముగ్గులు నేలమ్మను పలకరించాయి. చుక్కలతో వేసిన రంగవల్లుల మధ్య గొబ్బెమ్మలు.. చెరుకుగడలు.. పిండి వంటల అలంకరణలతో సంక్రాంతి శోభను ముందే తెచ్చాయి. ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) తెలంగాణ రాష్ట్ర స్థాయి ఫైనల్స్ పోటీలు హైదరాబాద్‌లోని సనత్‌నగర్ జీహెచ్ఎంసీ మున్సిపల్ గ్రౌండ్‌లో ఉల్లాసంగా.. ఉత్సాహంగా శుక్రవారం జరిగాయి. విజేతలకు ముఖ్య అతిథులు సినీనటి వైష్ణవీచైతన్య, సినీనటుడు వద్లమాని సాయి శ్రీనివాస్ బహుమతులను అందజేశారు."





పోటీలో రంగవల్లులు వేస్తున్న మహిళలు



ముగ్గు వేస్తున్న మహిళ



బహుమతుల ప్రదానోత్సవంలో మాట్లాడుతున్న సినీ నటుడు వద్లమాని సాయి శ్రీనివాస్, చిత్రంలో న్యాయ నిర్ణేతలు పి. రజని, డాక్టర్ పి. శ్రీలక్ష్మి, నటి వైష్ణవీ చైతన్య, సంతూర్ హైదరాబాద్ ఏరియా మేనేజర్ సంజీవ్ మోదీ, ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, ఇన్‌చార్జి కృష్ణప్రసాద్

తెల్లారిన బతుకులు

- సూర్యాపేట జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం
- ఐలాపురం రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు
- ఐదుగురు మృత్యువాత
- 10 మందికి గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం
- మృతులంతా ఒడిశా వాసులే



ఐలాపురం గ్రామ స్టేజీ వద్ద లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

చివ్వెంల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తెల్లవారుజామున మంచు కురుస్తూ నిర్మానుష్యంగా ఉన్న జాతీయ రహదారి ఒక్కసారిగా రక్తసిక్తమైంది. టైరు పేలి రోడ్డు పక్కన నిలిపి ఉంచిన లారీని ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టిన ఘటనలో ఐదుగురు కూలీలు అక్కడికక్కడే మృతిచెందగా, 10మందికిపైగా గాయపడ్డారు. మృతుల్లో భార్యాభర్తలు, ఓ మహిళ, వృద్ధుడు, డ్రైవర్ ఉన్నారు. క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. శుక్రవారం తెల్లవారుజామున సూర్యాపేట జిల్లా చివ్వెంల మండల పరిధిలోని ఐలాపురం గ్రామ స్టేజీ సమీపంలో ఖమ్మం-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఈ ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎస్ఐ వల్లపు మహేశ్వర్ తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రం కోరాపూట్ జిల్లాకు చెందిన 32మంది హైదరాబాద్‌లో భవన నిర్మాణ కార్మికులుగా పనిచేసి కుటుంబాలను పోషించుకుంటున్నారు. పనులు ముగియడంతో రెండు నెలల క్రితం వారు సొంత రాష్ట్రానికి వెళ్లారు. హైదరాబాద్‌లోని కోఠి, జీడిమెట్ల ప్రాంతాల్లో పనులు ప్రారంభం కావడంతో భవన నిర్మాణ పనులు చేయడానికి తిరిగి గురువారం ఉదయం ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన ఓ ట్రావెల్ బస్సులో హైదరాబాద్‌కు బయలుదేరారు.

మంచు కురిసి... అతివేగం...

మొత్తం 800కిలోమీటర్ల ప్రయాణం కాగా 12గంటల్లో హైదరాబాద్ చేరుకోవాల్సి ఉంది. బస్సు నడిపేందుకు ఇద్దరు డ్రైవర్లు ఉన్నారు. ఒడిశా నుంచి ఛత్తీస్‌ఘడ్ వరకు ఒక డ్రైవర్ వాహనం నడపగా, ఛత్తీస్‌ఘడ్ నుంచి సునిల్ గోర్థ వాహనం నడుపుతున్నాడు. మరో రెండున్నర గంటల్లో హైదరాబాద్ చేరుకోవల్సి ఉండగా, బస్సు ఖమ్మం జిల్లా దాటి సూర్యాపేట జిల్లాకు చేరుకుంది. చివ్వెంల మండల పరిధిలోని ఐలాపురం గ్రామ స్టేజీ వద్ద జాతీయ రహదారి పక్కన ఓ ఇసుక లారీ టైర్ పేలటంతో పక్కన నిలిపి ఉంచాడు. అదే సమయంలో మంచు కురుస్తుండటంతో, 10 నిమిషాల అనంతరం అదే దారిలో వచ్చిన ట్రావెల్స్ బస్సు డ్రైవర్ వెనుకనుంచి లారీని బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందగా, వెనుకగా ఉన్న సీట్లలో కూర్చున్న ప్రయాణికులు చెల్లాచెదురయ్యారు. ఈ ప్రమాదంలో ఒడిశా రాష్ట్రం కోరాపుట్‌కు చెందిన దంపతులు రూపు హరిజన్(51), సూల హరిజన్(46), సునమణి హరిజన్(61), ప్రత్యుష్ ప్రభాత్ హరిజన్(17), నబరంగపూర్ జిల్లాకు చెందిన లహరికన్ని గ్రామానికి చెందిన బస్సు డ్రైవర్ సునిల్ గోర్థ(37) మృతిచెందారు. మరో 10మందికి గాయాలుకాగా, వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. రోడ్డు ప్రమాద ఘటన గురించి తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బస్సులో ఇరుక్కున్న ఐదుగురి మృతదేహాలను బయటికి తీయించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్ ద్వారా సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. బస్సులో ఉన్న 17మంది ప్రయాణికులు మృతదేహాలను, క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించే సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ఈ ప్రమాదంతో అక్కడ గంటకు పైగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. సూర్యాపేట డీఎస్పీ రవి ఆధ్వర్యంలో సహాయక చర్యలు చేపట్టారు. రెండు వాహనాలను ప్రొక్లెయినర్ల సహాయంతో పక్కకు తొలగించారు. జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతుల సంబంధీకుడు తల్వాడ లాభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వల్లపు మహేశ్వర్ తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఒడిషాకు చెందిన కూలీలు

డ్రైవర్ల నిర్లక్ష్యమే కారణమా?

ట్రావెల్ బస్సు-లారీని ఢీకొన్న ప్రమాదంలో రెండు వాహన డ్రైవర్ల నిర్లక్ష్యం ఉందని అధికారులు భావిస్తున్నారు. టైరు పేలడంతో లారీని రోడ్డు పక్కకు నిలిపే సమయంలో లారీ డ్రైవర్ ఎలాంటి జాగ్రత్తలు పాటించలేదని తెలుస్తోంది. దీంతో చలికాలం కావడం, మంచు కురుస్తుండటం, బస్సు డ్రైవర్ అతివేగంగా రావడంతోనే ఆగి ఉన్న లారీని ఢీకొట్టి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

క్షతగాత్రులు వీరే..

మంజీ బోజ్‌నాథ్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన రెండో బస్సు డ్రైవర్ లవాంగ్ దినేష్, రూప్‌దర్ బంజారాలతో పాటు మరో ఏడుగురు కూలీలకు గాయాలయ్యాయి. వారిలో ఇద్ద కూలీల పరిస్థితి విషమంగా ఉంది.

గంటకు పైగా ట్రాఫిక్ జామ్

ఖమ్మం- హైదరాబాద్ రహదారిపై తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదం కారణంగా సుమారు గంటకు పైగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సూర్యాపేట డీఎస్పీ రవి ఆధ్వర్యంలో సీఐ రాజశేఖర్, ఎస్ఐలు వల్లపు మహేశ్వర్, బాలునాయక్ సంఘటనా స్థలానికి సిబ్బందితో చేరుకుని క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన వాహనాలను ఎక్సవేటర్ సహాయంతో రోడ్డు పక్కకు జరిపి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

డివైడర్‌పై కాలు... భయభ్రాంతులకు గురైన స్థానికులు

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తికి ఓ కాలు విరిగి పక్కకు పడిపోయింది. దానిని గమనించని పోలీసులు మృతదేహాలను ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పడిపోయిన కాలును ఓ లారీ డ్రైవర్ పోలీస్ సిబ్బందికి చెప్పకుండా జాతీయ రహదారి డివైడర్ మధ్యలో వేశాడు. స్థానికులు చూసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఆ కాలును ఒక కవర్‌లో పెట్టి జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మృతుని పట్ల కనికరం లేకుండా శరీర భాగాన్ని కనబడకుండా డివైడర్‌లో వేయడం పట్ల స్థానికులు అసహనం వ్యక్తం చేశారు.

ఖాకీ అవినీతి కలకలం !

(5వ పేజీ తరువాయి)

కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని చెబుతున్నారు. ఈ అధికారికి అన్నీతానై నమ్మకంగా ఉండే ఒక ఏఎస్ఐ తన సొంత ప్లాటుని వీరిపేరున రిజిస్ట్రేషన్ చేయించి, లోన్‌కూడా ఇప్పించారని, కొంత మొత్తాన్ని ఈ అధికారి తరఫున వడ్డీలకు ఇవ్వగా, రిటర్న్‌లు రాకపోవడంతో అతని నుంచి ఖాళీ చెక్‌లు రాయించుకొని, ఇప్పుడు కేసు పెడతామని హెచ్చరిస్తున్నట్లు చెబుతున్నారు. మరికొందరు సిబ్బంది నుంచి అప్పుగా తీసుకున్న మొత్తం ఇవ్వకపోవడంతో వారంతా ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక ఆవేదన చెందుతున్నారని చెబుతున్నారు. ఓ ఎస్ఐ భారీగా అప్పు ఇవ్వగా, మళ్లీ ఇవ్వకపోవడంతో సదరు ఎస్ఐ సతీమణి ఉన్నతాధికారులకు విన్నవిస్తానని చెప్పగా, సగం డబ్బు అప్పటికప్పుడు చెల్లించారని, మిగతా మొత్తం ఇవ్వలేదనే గుసగుసలు పోలీసుల్లో వినిపిస్తున్నాయి. కార్యాలయం నుంచి తప్ప టూర్లకు వెళ్లకుండానే టీఏలు, డీఏలు క్లెయిమ్ చేస్తున్నారని, వాహనాలకు డీజిల్ వాడుతున్నారని చెబుతున్నారు. ఒక ఎస్ఐ ఈ అధికారి కుటుంబీకుల బర్త్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించగా, గత నాలుగేళ్లుగా సిబ్బంది బంగారుబహుమతులు ఇచ్చారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ అధికారి పరిధిలో భారీ మొత్తంలో ఎస్ఆర్ అమౌంట్ నొక్కేశారనే ఆరోపణలు చేస్తున్నారు. మొత్తంగా గత ఏడేళ్లుగా ఇక్కడే తిష్టవేసిన ఈ అధికారి శాఖలో సీఐలు, ఎస్ఐలు, ఏఎస్ఐలు, కానిస్టేబుళ్లపై ఎవరిపై ఎలాంటి ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చినా వారిని తన టీమ్‌లోని కానిస్టేబుళ్ల ద్వారా పిలిపించుకొని వసూళ్లకు పాల్పడుతున్నారనే ఫిర్యాదులు బలంగా చక్కర్లు కొడుతున్నాయి. ఈ అధికారిపై వస్తోన్న ఆరోపణలపై సంబంధిత విభాగపు ఉన్నతాధికారులు విచారణ నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

గ్యాస్ సిలిండర్ లీకై సామగ్రి దగ్ధం

భువనగిరి రూరల్, జనవరి10(ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలిండర్ లీకై మంటలు లేచి ఇంట్లోని సామగ్రి దగ్ధమైంది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మ ండలం బస్వాపూర్ గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన మచ్చ బాలరాజుగౌడ్ ఇంట్లో గురువారం రాత్రి అతని కుమారుడు మచ్చ నవీన్ గ్యాస్ సిలిండర్‌ను స్టౌవ్‌కు అమర్చుతున్న క్రమంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో కుటుంబ సభ్యులు ఒక్కసారిగా బయటకు పరుగులు తీశారు. చుట్టు ప్రక్కల వారు నీటిని చల్లి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో వంట సామాగ్రితో పాటు దుస్తులు దగ్ధమయ్యాయి. దాదాపు రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

ఇంటికి వస్తూ అనంతలోకాలకు..

- జనగామ జిల్లాలో రోడ్డు ప్రమాదం.. ఇద్దరు సూర్యాపేట జిల్లావాసులు మృతి



ప్రమాదానికి గురైన తుఫాన్ వాహనం, పేరాల వెంకన్న, లక్ష్మి(ఫైల్)

నాగారం, కొడకండ్ల జనవరి 10(ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లాలో గురువారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. సూర్యాపేట జిల్లా నాగారం మండలం ఈటూరు గ్రామానికి చెందిన పేరాల వెంకన్న(45), పేరాల లక్ష్మి(35) అక్కడికక్కడ మృతి చెందగా పేరాల ఉషయ్య, లావణ్య, ఉప్పలమ్మ, ముత్యాలు, వంగూరి నరసమ్మలకు తీవ్రగాయాలయ్యాయి. పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండిలో పేరాల వెంకన్న చిన్నకొడుకు కొడుకు డోలా రోహణ ఫంక్షన్ గురువారం జరిగింది. ఈటూరుకు చెందిన బంధువులు ఈ వేడుకలకు హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో తుఫాన్ వాహనం ఎక్కారు. డ్రైవర్ ప్యాసింజర్లను ఎక్కించుకున్నాడు. తిరుమలగిరి వైపు వెళ్తున్న తుఫాన్ వాహనం అర్ధరాత్రి సుమారు 11.40గంటల సమయంలో కొడకండ్ల మండలంలోని మైదంచెరువుతండా సమీపంలో ఇనుప రేకుల లోడ్‌తో ఉన్న డీసీఎం వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఊటూరుకు చెందిన పేరాల వెం కన్న(45), అతడి తమ్ముడి భార్య పేరాల లక్ష్మి(35) ఘటనా స్థలంలోనే మృతిచె ందారు. పేరాల ఉషయ్య, లావణ్య, ఉప్పలమ్మ, ముత్యాలు, వంగూరి నరసమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని హైదరాబాద్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మిగతావారు క్షేమంగా ఉన్నట్లు సమా చారం. కాగా, ప్రమాదం జరిగిన సమయంలో తుఫాన్ వాహనంలో 12మంది ఉన్నట్టు పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఆస్పత్రికి తరలించారు. వెంకన్న కుమారుడు పేరాల రాజు ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజు కేసు నమోదు చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈటూరులో విషాదఛాయలు

జనగాం జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నాగారం మండలం ఈటూరు గ్రామానికి పేరాల వెంకన్న, జ్యోతి మృతదేహాలను జనగాం జిల్లా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులు శుక్రవారం స్వగ్రామానికి తీసుకొచ్చారు. మృతుల బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. విషయం తెలుసుకున్న తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు ఈటూరు గ్రామానికి చేరుకుని పేరాల వెంకన్న, జ్యోతిలకు మృతదేహాలపై పులమాల వేసి నివాళులర్పించారు.

వైభవంగా ముక్కోటి ఏకాదశి

● భక్తులకు ఉత్తరద్వార దర్శనం
● స్వామివారిని దర్శించుకొని పరవశించిన భక్తులు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని జిల్లాలో వైభవంగా నిర్వహించారు. ఆలయాల్లో స్వామివారిని శుక్రవారం భక్తులు ఉత్తరద్వార దర్శనం చేసుకున్నారు. జిల్లా కేంద్రంలోని రామగిరి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తుల కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసిన ఉత్తరద్వారం నుంచి స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి పల్లకిలో స్వామివారిని ఆశీనులను చేసి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. శ్రీమాన్ భాష్యం జగన్నాధచార్యుల ఆధ్వర్యంలో ఆండాళ్ అమ్మవారు రచించిన తిరుప్పావై ప్రవచనం చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మునిసిపల్ చైర్మన్ బుర్రిశ్రీనివా‌స్‌రెడ్డి దంపతులు, జిల్లా జడ్జి నాగరాజు దంపతులు ప్రత్యేకంగా హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. వికాసతరంగిణి ఆధ్వర్యంలో శ్రీ విష్ణుసహస్రనామ పారాయణం చేశారు. విద్యుత్ దీపాలతో దేదీప్యమానంగా వెలిగింది. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఏసీ కె. భాస్కర్, ఆలయ ఈవో జయరామయ్య, అనిల్‌రెడ్డి, అర్చకస్వాములు పాల్గొన్నారు. అదేవిధంగా వీటీకాలనీలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో కౌన్సిలర్ రావిరాల పూజిత వెంకటేశ్వర్లు, నూకల జయపాల్‌రెడ్డి, శ్యాంసుందర్, మేడం ప్రభాకర్ పాల్గొన్నారు. తులసీనగర్ శ్రీభక్తాంజనేయస్వామి ఆలయం, షేర్‌బంగ్లాలోని సంతోషిమాత ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం కుడారై ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో జయరామయ్య తెలిపారు. భక్తులు అధిక సంఖ్య పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

చండూరు, లకినేనిగూడెం గ్రామాల్లోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయాల్లో భక్తులు స్వామివారిని ఉత్తరద్వార దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోమటి వీరేశం, మాజీ సర్పంచ్ కోడి గిరిబాబు, తాడిశెట్టి గంగాధర్, సత్యనారాయణ, గంగాధర్, ఆంజనేయులు, భిక్షమయ్య, వెంకటేశం, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కట్టంగూరులోని శ్రీలక్ష్మీనారాయణస్వామి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి వేడుకలను భక్తులు వైభవంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలకు పంచామృతాలతో భక్తులు అభిషేకం చేశారు. అనంతరం ఆలయంలో మహాయజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి రామడుగు శ్రీనివాస్ శర్మ, ఆలయ కమిటీ చైర్మన్ రెడ్డిపల్లి మనోహర్, బండారు అరుణ్, యాదయ్య, సైదులు, గోపి పాల్గొన్నారు.

నార్కట్‌పల్లిలోని వేణుగోపాలస్వామి ఆలయం, గోపలాయపల్లిలోని వారిజాల వేణుగోపాలస్వామి, శాపల్లిలోని కమలాద్రి లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం, అక్కెనపల్లిలోని సాలగ్రామ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులు స్వామివారిని ఉత్తర ద్వారదర్శనం చేసుకున్నారు. అర్చకులు కారంపూడి నర్సింహాచార్యులు, వేంకటాచర్యులు, కృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు విష్ణు సహస్ర నామాలను, పాశురాలను పఠించారు. వేడుకల్లో కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, కసిరెడ్డి సుదర్శన్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, దోసపాటి ప్రసాద్, విష్ణు, వేణు, రఘు, రమేష్, దుబ్బాక శ్రీధర్, బండారు శ్రీనివాస్, సామ కొండల్‌రెడ్డి, దయాకర్, రవీందర్, రమేశ్, పాండురంగయ్య, వెంకన్న, శ్రీకాంత్ పాల్గొన్నారు.

చిట్యాల మండలంలోని నేరడలో సీతారామాంజనేయ స్వామి, వనిపాకలలో శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పూజలు వైభవంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ నిర్వాహకులు, అర్చకులు వైకుంఠ ఏకాదశి ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు.


నల్లగొండ రామగిరిలోని రామాలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

శాలిగౌరారంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. శాలిగౌరారం గ్రామానికి చెందిన విశ్రాంత అధ్యాపకుడు గురిజాల వెంకటేశ్వర్లు, రమాదేవి దంపతులు లక్ష రూపాయల వ్యయంతో పల్లకి చేయించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు శేషం రత్నమాచార్యులు, శేషం జగన్మోహన్‌చార్యులు, నాయకులు వడ్లకొండ పరమేష్‌గౌడ్ దంపతులు, మాజీ ఎంపీటీసీ జోగు సైదమ్మశ్రీనివాస్, శ్రీమన్నానారాయణ స్వామి, మాలధారులు భక్తులు పాల్గొన్నారు.

మునుగోడు మండలం కొరటికల్ గ్రామంలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామి ఉత్తరద్వారం గుండా భక్తులకు దర్శనమిచ్చారు.

నకిరేకల్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


నల్లగొండ వివేకానందనగర్‌లో పూజలు చేస్తున్న భక్తులు


నల్లగొండ పట్టణంలో స్వామివారి ఊరేగింపు


నల్లగొండ వీటీ కాలనీలో పూజలు చేస్తున్న మోహన్‌రెడ్డి దంపతులు


శాలిగౌరారంలో గరుడవాహనంపై దేవతామూర్తులను ఊరేగిస్తున్న గ్రామస్థులు

నల్లగొండ
నకిరేకల్ - మునుగోడు

వివేకానంద జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

నాంపల్లి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): నేటి యువత స్వామి వివేకానంద జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ముత్యం వెంకన్న అన్నారు. వివేకానంద జయంతిని నిర్వహించుకొని శుక్రవారం జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, దేశభక్తి గేయాల పోటీలను నిర్వహించారు. ప్రతిభకనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివేకానందుని ఆశయ సాధన కోసం యువత కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్వామివివేకానంద ఉత్సవ సమితి అధ్యక్షుడు కర్నాటి శ్రీహరి, అధ్యాపకులు రజనీకాంత్, శ్రీనివాస్, సైదులు, ముత్యాలు, ప్రసన్నలత, శిరీష, శైలజ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

గట్టుప్పల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): యువకులు క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు రావుల రమేష్ అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకొని శుక్రవారం గట్టుప్పల్ ప్రీమియర్ లీగ్‌ను గట్టుప్పల్ తహసీల్దార్ రాములుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన యువకులకు రూ.5 వేలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువకులకు క్రీడలు, మానసిక, శారీరక, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని అన్నారు. కార్యక్రమంలో మల్లేష్‌గౌడ్, యాదగిరిరెడ్డి, శ్రీరాములు, నూరు మహ్మద్, నగేష్, నవీన్, వెంకటేష్ గౌడ్, అజయ్, శివ, అంజయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దగట్టు జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏడుకొండలు


నల్లగొండటౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండవ అతిపెద్ద జాతర అయిన గొల్లగట్టు జాతర (పెద్దగట్టు)ను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించి జాతర నిర్వహణ కోసం రూ.100 కోట్లు కేటాయించాలని ఆల్ ఇండియా యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు ఏడుకొండలుయాదవ్ అన్నారు. సదర్ పండగను రాష్ట్ర పండుగగా గుర్తించినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కేంద్రంలోని యాదవ సంఘ భవనంలో శుక్రవారం యాదవమహాసభ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో, నామినేటెడ్ పోస్టుల కేటాయింపుల్లో జనాభాలో అత్యధికంగా ఉన్న యాదవులకు సముచిత స్థానం కల్పించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీ పథకాన్ని కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్రంలో గొర్రెల పెంపకందారుల సహకార సంఘాలకు యూనియన్ ఎన్నికలు నిర్వహించి రాష్ట్ర ఫెడరేషన్ ఏర్పాటుతో పాటు మేనేజింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి లొడంగి గోవర్ధన్‌యాదవ్, రాష్ట్ర నాయకుడు సోమనబోయిన సుధాకర్ యాదవ్, ఎల్‌వీ యాదవ్, మాజీ అధ్యక్షుడు అల్లి వేణుయాదవ్, నాయకులు కాశీరాములు, చీర పంకజ్‌యాదవ్, వంగూరి లక్ష్మీనారాయణ యాదవ్, చందుయాదవ్, మామిడి పద్మ, బెల్లి నాగరాజుయాదవ్, శివయాదవ్ పాల్గొన్నారు.

కేటీఆర్‌పై కేసు కక్ష సాధింపే : చిరుమర్తి


సమావేశంలో మాట్లాడుతున్న లింగయ్య, నాయకులు

నార్కట్‌పల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కేటీఆర్‌పై ఈ-ఫార్ములా కేసు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కక్ష సాధింపు చర్యల్లో భాగమేనని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శించారు. నార్కట్‌పల్లిలోని తన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచిన ఘనత కేటీఆర్‌దేనని అన్నారు. కేటీఆర్‌ను ఎలాగైనా జైలుకు పంపాలన్నదే రేవంత్ ఫార్ములా అని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే రైతుబంధు రూ.15 వేలు ఇస్తామని ప్రకటించి ఇప్పుడు 12 వేలు ఇస్తామనడం రైతులను మోసం చేసినట్లేనని అన్నారు. అన్ని విధాలుగా ఆదుకున్న కేసీఆర్‌ను ఓడించి తాము పెద్ద తప్పు చేశామని రైతుల్లో పశ్చాత్తాపం కనపడుతోందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి కరుణాకర్‌రెడ్డి, నాయకులు యానాల అశోక్‌రెడ్డి, మేకల రాజిరెడ్డి, కొండూరు శంకరయ్య, దుబ్బాక శ్రీధర్, కమ్మంపాటి వెంకటయ్య, సతీష్, మహేష్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

పండుగల ప్రాముఖ్యాన్ని తెలియజేయాలి


స్కూల్ వద్ద ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

నల్లగొండ టౌన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పండుగల ప్రాముఖ్యాన్ని తెలియజేయాలని భారత్ భవిత హైస్కూల్‌లో పాఠశాల కరస్పాండెంట్ మోదుగు సత్తిరెడ్డి, ప్రిన్సిపాల్ జ్యోతి అన్నారు. సంక్రాతి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్రంలోని భారత్ భవిత హైస్కూల్‌లో ముగ్గుల పోటీలను నిర్వహించారు. విద్యార్థుల్లో పోటీతత్వం పెంచేలా నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల ముగ్గలను వేసి అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు పాఠశాల కరస్పాండెంట్ మోదుగు సత్తిరెడ్డి, ప్రిన్సిపాల్ జ్యోతి బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగయ్య, సుధాకర్, నాగేందర్, మౌలాన, ఉమా, విజయలక్ష్మి, అనిత, సుమలత, పుష్పలత, సమీనాబేగం పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి వేడుకలు

చండూరు: మండలంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. చండూరులోని డాన్‌బోస్కో కళాశాల, సన్‌షైన్, గాంధీజీ, కృష్ణవేణి, గీతా విద్యాలయాల్లో పండుగ కళ ఉట్టిపడింది. విద్యార్థులు తెలుగుదనం ఉట్టిపడేలా దుస్తులు ధరించి ముగ్గులు వేశారు. అనంతరం పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు గాలి పటాలను పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ బాలశౌరి, గాంధీజీ పాఠశాల కరస్పాండెంట్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కోడి శ్రీనివాసులు, సన్‌షైన్ పాఠశాల కరస్పాండెంట్ కోడి వెంకన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'కల్యాణలక్ష్మి' పేదలకు వరం

● ఎమ్మెల్యే వేముల వీరేశం

కట్టంగూరు, నార్కట్‌పల్లి, చిట్యాల, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కల్యాణలక్ష్మి పథకం పేదలకు వరమని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శుక్రవారం కట్టంగూరు, నార్కట్‌పల్లి మండలాలకు చెందిన లబ్ధిదారులకు ఆయన చెక్కులు అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలతో పాటు అభివృద్ధిలో కూడా శరవేగంగా ముందుకుసాగుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. నకిరేకల్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కట్టంగూరులో 112 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, మాజీ జడ్పీటీసీలు మాద యాదగిరి, సుంకరబోయిన నర్సింహ, మాజీ ఎంపీపీ రెడ్డిపల్లి సాగర్, నాయకులు నంద్యాల వెంకట్‌రెడ్డి, బూరుగు శ్రీను, మిట్టపల్లి శివశంకర్, నర్సింహ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి మండలంలో ఎమ్మెల్యే వేముల వీరేశం శుక్రవారం సుడిగాలి పర్యటన చేశారు. వివిధ ఆధ్యాత్మిక, అభివృద్ధి సంక్షేమం, సాంస్కృతిక కార్యక్రమాల్లో కార్యకర్తలతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. మొదట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో 50మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. సంక్రాంతి సందర్భంగా పట్టణంలోని కాకతీయ హైస్కూల్‌లో జరిగిన సంబరాల్లో భాగంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. అనంతరం మండలంలోని మాండ్ర గ్రామ శివారులో గల నార్లగుట్టపై ఉన్న లక్ష్మీనర్సింహస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో ఉమేష్‌చారి, ఆర్ఐ తరుణ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, నాయకులు బండా సాగర్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, నట్టు సత్తయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, జెరిపోతుల భరత్, పుల్లెంల అచ్చాలు, యాదయ్య, యాదయ్య, కృష్ణయ్య, స్వామిగౌడ్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.


కట్టంగూరులో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

చిట్యాలలో నిర్వహించిన కార్యక్రమంలో మునిసపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, మార్కెట్ చైర్‌పర్సన్ నర్రా వినోద, తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీవో జయలక్ష్మి, సీఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆశాలకు కనీస వేతనం అమలుచేయాలి


మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు

నల్లగొండరూరల్, నకిరేకల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్లకు రూ.18వేల కనీస వేతనం అమలుచేయాలని, లేకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఆశావర్కర్ల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం నల్లగొండలోని మంత్రి క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశావర్కర్లకు ప్రభుత్వం రూ.18వేలు ఫిక్స్‌డ్ వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. లేకుంటే ఆశావర్కర్లు విధులను బహిష్కరించి పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఆశాల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డి.సత్తయ్య, సత్యనారాయణ, గణేష్, పార్వతమ్మ, కల్పన, మల్లేశ్వరి పాల్గొన్నారు.

● నకిరేకల్ పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే వేముల వీరేశాన్ని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పెంజర్ల సైదులు, వంటెపాక వెంకటేశ్వర్లు, ఆదిమల్ల సుధీర్, ఆశావర్కర్లు జిల్లా కార్యదర్శి తవిటి వెంకటమ్మ, బెరుకు జానకి, ధనలక్ష్మి, సునీత, చంద్రకళ, లక్ష్మి, జయమ్మ, భూలక్ష్మి, శ్రీదేవి, అనిత పాల్గొన్నారు.


ఎల్లమ్మ ఆలయ కమిటీ ప్రమాణస్వీకారం

● ఎల్లమ్మ ఆలయ చైర్మన్‌గా వెంకట్‌రెడ్డి
● మరో 14 మంది సభ్యుల ప్రమాణం


ప్రమాణస్వీకారం చేసిన పాలకమండలి సభ్యులతో శ్రీనివాస్‌రెడ్డి

కనగల్, జనవరి 10: (ఆంధ్రజ్యోతి) మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయ నూతన పాలక మండలి సభ్యులు శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ భాస్కర్ పాలకమండలి సభ్యులతో ఆలయ ప్రాకార మండపంలో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఏసీ మాట్లాడుతూ నూతన పాలక మండలి సభ్యులు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలన్నారు. ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అంతకుముందు పాలకమండలి సభ్యులు ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ సిబ్బంది నాయకులు చైర్మన్‌తో పాటు పాలకమండలి సభ్యులకు శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, ఆలయ ఈవో జయరామయ్య, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సుమతి, మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి, మాజీ చైర్మన్లు, దేప కరుణాకర్‌రెడ్డి, కంచరకుంట్ల గోపాల్‌రెడ్డి, ముత్తయ్య, గణేష్ నాయకులు గోలి జగాల్‌రెడ్డి, నర్సిరెడ్డి, నగేష్‌గౌడ్, శ్రీను, సైదులుగౌడ్ పాల్గొన్నారు.

పునరావాసానికి స్థల పరిశీలన


మదనాపల్లిలో భూమిని పరిశీలిస్తున్న అధికారులు

మర్రిగూడ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా చర్లగూడ రిజర్వాయర్‌లో ముంపునకు గురైన భూ నిర్వాసితులు, ఇరిగేషన్ అధికారులు కలిసి శుక్రవారం పునరావాసం కోసం స్థలాన్ని పరిశీలించారు. రిజర్వాయర్‌లో ముంపునకు గురైన నర్సిరెడ్డిగూడెం, చర్లగూడెం, వెంకెపల్లి, వెంకేపల్లితండా బాధితులకు ఇప్పటి వరకు పునరావాసం కోసం స్థల సేకరణ చేపట్టలేదు. అంతే కాక ఇంటి స్థలాలను కేటాయించకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో వారం రోజుల నుంచి రిజర్వాయర్ పనులు అడ్డగిస్తూ భూనిర్వాసితులు పనులు జరగకుండా నిలిపివేస్తున్నారు. తమకు ఇంటి స్థలాన్ని చూపిస్తామంటూ ఇరిగేషన్ అధికారులు మాయ మాటలు చెబుతూ పనులు చేపడుతున్నారని నిర్వాసితులు ఆరోపిస్తున్నారు. మూడు గ్రామాల్లో కలిసి 2 వేల మంది బాధితులు ఉన్నారని, తొమ్మిదేళ్ల అయిన పునరావాసం కల్పించలేదంటూ బాధితులు వాపోతున్నారు. చింతపల్లి మండలం మదనాపురం గ్రామ పరిధిలోని దేవదాయశాఖకు సంబంధించిన భూమిని బాధితులతో కలిసి పరిశీలించారు. ఆ భూమిలో పునరావాసం కల్పిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అనంతరం ముంపు బాధితులు మాట్లాడుతూ వెంటనే పునరావాసం, అర్హులైన కొంతమందికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాదయ్య, శ్రీను, లక్ష్మమ్మ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటిపన్ను నూరు శాతం వసూలు చేయాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో వెంకటయ్య

నార్కట్‌పల్లి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ పరిధిలో వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య అన్నారు. నార్కట్‌పల్లిలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం చిట్యాల, కట్టంగూరు, నార్కట్‌పల్లి మండలాల పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షా సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఆర్థిక సంవత్సరం ముగిసే వరకు ఇంటి పన్నులు నూరు శాతం వసూలు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా వసతిగృహాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతీరోజూ పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేయాలన్నారు. రాబోయే వేసవికాలంలో నీటి ఎద్దడి లేకుండా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఎల్‌పీవో వెంకటేశ్వర్లు, ఎంపీవోలు సుధాకర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజల విశ్వాసాన్ని చూరగొనాలి


సముద్ర ఇన్ లాడ్జిని ప్రారంభిస్తున్న దృశ్యం

నల్లగొండటౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన సేవలందించడం ద్వారా ప్రజల విశ్వాసాన్ని చూరగొనాలని రెడ్‌క్రాస్ చైర్మన్ గోలి అమరేందర్‌రెడ్డి, సీనియర్ వ్యాపారవేత్త బిల్డర్ సముద్రాల వెంకయ్య అన్నారు. పట్టణంలోని క్లాక్‌టవర్‌లో గల సముద్ర ఇన్ లాడ్జిని శుక్రవారం వారు జ్యోతి ప్రజలన చేసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్పొరేట్ స్థాయిలో సేవలందించేందుకు ఆధునిక హంగులతో సముద్రఇన్ లాడ్జి నిర్మించిన నిర్వాహకులను అభినందించారు. లాడ్జి నిర్వాహకుడు సముద్రాల శ్రీనివాస్ మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుండి జిల్లా కేంద్రానికి వచ్చే వ్యాపారులు, రాజకీయ నాయకులు, వీఐపీలు, అధికారులు బస చేసేందురు విలాసవంతమైన సౌకర్యాలతో ఏసీ, నాన్‌ఏసీ రూమ్స్, లగ్జరీ రూమ్స్, మీటింగ్ హాల్స్ అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సముద్రాల శ్రీనిధి, గోపగాని మెహర్‌బాబా, కొనకంచి విజయ్‌కుమార్ డాక్టర్ పీవీఎస్ మూర్తి, హిమవంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

మర్రిగూడ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా ముంపునకు గురైన గ్రామాల బాధితులకు వెంటనే పునరావాసం కల్పించాలని టీడీపీ రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి ముద్దం శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రంలో ఆయన మాట్లాడారు. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా చర్లగూడ రిజర్వాయర్‌లో ఇప్పటికే సర్వం కోల్పోయారని, వారికి వెంటనే పునరావాసం చర్యలు చేపట్టాలని కోరారు. చర్లగూడ రిజర్వాయర్‌లో నర్సిరెడ్డిగూడెం, చర్లగూడెం, వెంకెపల్లి, వెంకేపల్లి తండా పూర్తిగా రిజర్వాయర్‌లో ముంపునకు గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం పునరావాసం కల్పించడంలో, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందించడంలో నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. వెంటనే ఈ ప్రభుత్వ పునరావాసం కల్పించాలని ఆయన కోరారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకన్న, నాయకులు పుప్పాల యాదయ్య, అంజయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలి

నార్కట్‌పల్లి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని అఖిల భారత గోసేవ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బాలకృష్ణ గురుస్వామి డిమాండ్ చేశారు. బాలకృష్ణ స్వామి బృందం చేపట్టిన పాదయాత్ర శుక్రవారం నార్కట్‌పల్లి పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా హైందవ అభిమానులు, అయ్యప్ప మాలధారులు పాదయాత్ర బృందానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'గో రక్ష భూ రక్ష' నినాదంతో కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు చేపట్టిన తన పాదయాత్ర నార్కట్‌పల్లిలో 106వ రోజుకు చేరుకుందన్నారు. కార్యక్రమంలో పెండోట సోమయ్య, దూదిమెట్ల సత్తయ్య, పాల్వాయి భాస్కర్‌రావు, చొల్లేటి శ్రీనివాసచారి, ఓం ప్రకాశ్, దయాకర్, సత్యనారాయణచారి పాల్గొన్నారు.

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972


చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 72

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.136	220	240
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.130	180	200

ఉష్ణోగ్రత గరిష్ఠం 27.0 । కనిష్ఠం 15.8





జిల్లాకేంద్రంలోని రామాలయంలో స్వామివారిని ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటున్న భక్తులు

జిల్లాకేంద్రంలోని రామాలయంలో ఏకాదశి వేడుకల్లో పాల్గొన్న జిల్లా జడ్జి నాగరాజు దంపతులు, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి దంపతులు

కన్నులారా నిన్నుకాంచి

- గుట్టలో ఉగ్రనారసింహుని ఉత్తర ద్వార దర్శనం
- ముక్కోటికి తరలివచ్చిన భక్తజనం
- యాదగిరిగుట్టలో అధ్యయనోత్సవాలకు శ్రీకారం
- జిల్లావ్యాప్తంగా ముక్కోటి వేడుకలు
- భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు
- ఉదయం నుంచే భక్తుల పూజలు

6,8

ముక్కోటి ఏకాదశి వేడుకలు జిల్లావ్యాప్తంగా వైభవంగా కొనసాగాయి. ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. జిల్లాకేంద్రంలోని రామాలయంలో స్వామివారి ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. జిల్లా జడ్జి నాగరాజు దంపతులు, నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రిశ్రీనివాస్‌రెడ్డి దంపతులు, ప్రత్యేకంగా హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.



సీఎం సమీక్షలో జిల్లా కలెక్టర్

సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి

తెల్లారిన బతుకులు

- ఆగి ఉన్న లారీని ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు
- బస్సులో ఒడిషా, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల వలస కూలీలు
- నిద్రమత్తులోనే ఐదుగురు మృత్యు ఒడిలోకి
- 10 మందికి గాయాలు, ఇద్దరి పరిస్థితి విషమం





సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

రాష్ట్రం దాటి జీవనోపాధి కోసం వలస వస్తున్న కూలీలు మార్గమధ్యలోనే మృత్యువాత పడ్డారు. కూలినాలి చేసుకుని పొట్టపోసుకునే ఒడిషా రాష్ట్రానికి చెందిన కూలీలు రెండు నెలల కిందట సొంత ప్రాంతాలకు వెళ్లారు. అక్కడ నుంచి తిరిగి వస్తుండగా విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి(65) చివ్వెంల మండలం ఐలాపురం వద్ద ఆగి ఉన్న లారీని కూలీలు ప్రయాణిస్తున్న బస్సు ఢీకొట్టడంతో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు. తెల్లవారుజాము కావడంతో నిద్రలో ఉన్న కూలీలు ఆ నిద్రలోనే మృత్యుఒడికి చేరారు. మృతుల్లో భార్యాభర్తలు ఉన్నారు. 10 మంది గాయపడగా, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం ఐదుగురి ప్రాణాలను బలితీసుకుంది. మంచుకురుస్తుండటం, ప్రైవేట్ బస్సు వేగంగా ఉండటంతో లారీ ఆగి ఉన్న విషయాన్ని గమనించకపోవడంతోనే ప్రమాదం చోటుచేసుకుందని భావిస్తున్నారు.

వివరాలు 7లో

టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికకు





- పులి సరోత్తమ్‌రెడ్డిని ప్రకటించిన బీజేపీ
- ఇప్పటికే దూకుడులో యూటీఎఫ్ అభ్యర్థి నర్సిరెడ్డి
- కాంగ్రెస్, బీఆర్ఎస్ వైఖరిపై స్పష్టత కరువు

శాసనమండలి నల్లగొండ-వరంగల్-ఖమ్మం ఉపాధ్యాయ నియోజవర్గ ఎన్నికల్లో బలమైన పోటీకి రంగం సిద్ధమవుతోంది. ఉపాధ్యాయ సంఘాలు ప్రత్యక్షంగా, రాజకీయ పార్టీలు పరోక్షంగా ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న సంకేతాలు వెలువడుతున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పదవీకాలం మార్చి 29తో ముగియనుండడంతో ఈలోగా కొత్త ఎమ్మెల్సీగా ఎన్నుకునేందుకు ఎన్నికల సంఘం ప్రక్రియను ఇప్పటికే మొదలుపెట్టి, ఓటర్ల నమోదు ప్రక్రియను పూర్తిచేసింది. ఫిబ్రవరిలో ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉండగా అందరూ తమ కార్యాచరణను ప్రారంభించారు.

(ఆంధ్రజ్యోతిప్రతినిధి- నల్లగొండ)



సరోత్తమ్‌రెడ్డి



నర్సిరెడ్డి

రాష్ట్రంలో చైతన్యవంతమైన ప్రాంతంగా పేరున్న వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉమ్మడి జిల్లాల్లో విస్తరించిన ఈ ఉపాధ్యాయ నియోజకవర్గంలో గెలవడం ద్వారా తమ సత్తాను చాటాలని ప్రధాన ఉపాధ్యాయసంఘాలు భావిస్తున్నాయి. ఈ ఎన్నికను సవాల్‌గా తీసుకొని ఆయా సంఘాలు అభ్యర్థుల ఎంపిక, క్షేత్రస్థాయి ప్రచారం నిర్వహిస్తున్నాయి. ఈస్థానాన్ని తిరిగి గెలవడం ద్వారా ఉపాధ్యాయుల్లో తమపట్టుని కొనసాగించాలని యూటీఎఫ్ రంగంలోకి దిగితే, ఈసారి ఈ సీటులో గెలవడం ద్వారా తిరిగి పునర్వైభవం సాధించాలని పీఆర్‌టీయూటీఎస్ పావులు కదుపుతోంది. ఉపాధ్యాయ సమస్యలే లక్ష్యంగా ఏర్పాటైన తమ సంఘం అభ్యర్థిని గెలిపించుకోవడం ద్వారా ప్రభుత్వానికి దగ్గరిదారి ఏర్పడుతుందని టీజీపీఆర్‌టీయూ ప్రచారం మొదలుపెట్టింది. ఉపాధ్యాయసంఘాలంటే కొన్నివర్గాలకే పరిమితం కాదని, ఉపాధ్యాయులందరి సమస్యలకోసం తమ పార్టీ పనిచేస్తుందని, తమ పార్టీ అభ్యర్థికి మద్దతిచ్చి ఉపాధ్యాయులు గెలిపించాలని బీజేపీ ప్రకటిస్తోంది. పార్టీ తరఫున అభ్యర్థిని అధికారికంగా ప్రకటించడంతో ఈ స్థానంపై ఆ పార్టీ దృష్టిసారించిన విషయాన్ని తెలియజేస్తోంది.

బీజేపీ అభ్యర్థిగా పులి సరోత్తమ్‌రెడ్డి

బీజేపీ తన అభ్యర్థిగా హన్మకొండ జిల్లాకు చెందిన పులి సరోత్తమ్‌రెడ్డిని ప్రకటించింది. ఈమేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి శుక్రవారం అభ్యర్థిత్వాన్ని అధికారికంగా వెల్లడించారు. ఈయన స్కూల్ అసిస్టెంట్‌గా ఉపాధ్యాయవృత్తిలోకి ప్రవేశించి పదేళ్లపాటు ప్రధానోపాధ్యాయుడిగానూ పనిచేశారు. పీఆర్‌టీయూలో కొన్నేళ్లపాటు క్రియాశీలకంగా వ్యవహరించారు. సంఘంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా, రాష్ట్ర అధ్యక్షుడిగానూ వ్యవహరించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఏర్పాటైన ఉపాధ్యాయ జేఏసీలో క్రియాశీలకంగా..

మిగతా 6వ పేజీలో..

ఖాకీ అవినీతి కలకలం !

- సోషల్‌మీడియాలో చక్కర్లు
- సిబ్బంది వద్ద అప్పులు చేసి ఇవ్వడం లేదనే ఆరోపణలు
- శాఖాపరమైన విచారణ నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం



నల్లగొండ, జనవరి 10 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఒక సీనియర్ పోలీస్ అధికారిపై వస్తోన్న ఆరోపణలు కలకలం సృష్టిస్తున్నాయి. కీలకమైన బాధ్యతల్లో ఉన్న అధికారి అడ్డగోలు వ్యవహారశైలిపై తీవ్రస్థాయిలో సొంత శాఖ సిబ్బంది నుంచే విమర్శలొస్తున్నాయి. ఏడేళ్లుగా జిల్లాలో కీలకమైన పోస్టులో తిష్టవేసిన సదరు ఖాకీ ఆఫీసర్ ఏకంగా తనకు అనుకూలమైన బృందాన్ని ఏర్పాటు చేసుకొని భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారనే బలమైన ఆరోపణలతో పోలీస్ ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈ అవినీతి పోలీస్ అధికారిపై ఒక బాధితుడిపేరుతో ఏకంగా ఎనిమిది పేజీల లేఖ సోషల్‌మీడియాలో వైరల్ అవుతుండడం సంచలనం సృష్టిస్తోంది.

సిబ్బందితో వసూళ్లనే ఫిర్యాదులు

ఏడేళ్లుగా జిల్లాలో పనిచేస్తున్న సదరు అధికారి సిబ్బందినే తన బృందంగా ఏర్పాటు చేసుకొని వసూళ్లు చేశారనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రధానంగా పోలీస్‌శాఖలో సిబ్బంది నుంచి ప్రైవేట్ లోన్లు తీసుకొని ఇవ్వకపోవడం వంటి ఆరోపణలు బలంగా వినిపిస్తుండగా, సిబ్బందిపై ఫిర్యాదులున్నాయని పేర్కొంటూ వసూళ్లు చేశారని చెబుతున్నారు. నిత్యావసర వస్తువులు మొదలుకొని హోటల్‌లో వినియోగించే సామగ్రి వరకు సిబ్బంది ద్వారా వసూళ్లు చేసేవారనే ఆరోపణలు చేస్తున్నారు. ఇద్దరు కానిస్టేబుళ్లను కేవలం తన సొంత పనుల నిర్వహణకే వినియోగించుకుంటున్నారని, అదేవిధంగా మరో కానిస్టేబుల్, ఏఎస్ఐతో..

మిగతా 7వ పేజీలో..

మొదలైన సంక్రాంతి రద్దీ

- పట్టణాల నుంచి పల్లెలకు పయనం
- ఉమ్మడి జిల్లాలో వాహనాల సందడి
- బస్టాండ్లు కిటకిట



పంతంగి టోల్‌గేట్ వద్ద వాహనాల రద్దీ

6

ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని జాతీయ రహదారిపై సంక్రాంతి సందడి మొదలైంది. వరుస సెలవు దినాలు కావడంతో పట్టణాల నుంచి పల్లెలకు ప్రజలు పయనమయ్యారు. హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాలకు బయలుదేరిన వారితో శుక్రవారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రహదారులపై వాహనాల రద్దీ నెలకొంది. చౌటుప్పల్ పట్టణంలోని 65వ నెంబరు జాతీయ రహదారిపై వాహనాల రద్దీ ప్రారంభమైంది. ఈ రద్దీ ఈ నెల 13 వరకు కొనసాగనుంది. చౌటుప్పల్‌లో సుమారు రెండు కిలోమీటర్ల పొడవున ఉన్న జాతీయ రహదారిపై వాహనాలు నెమ్మదిగా కదులుతూ వెళ్లాయి.



భువనగిరి బస్టాండ్‌లో పాఠశాలల నుంచి ఇంటికి బయలుదేరిన చిన్నారితో ఆమె తల్లి

రాజకీయంగా చైతన్యవంతం కావాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

నాగార్జునసాగర్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): గిరిజనులు, ఆదివాసీలు ఆర్థికంగా, రాజకీయంగా చైతన్యవంతులు కావాలని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో నిర్వహిస్తున్న అఖిల భారత ఆదివాసీ కాంగ్రెస్ ప్రతినిధుల శిక్షణ తరగతుల్లో శుక్రవారం మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజన, ఆదివాసీల కోసం అనేక సంక్షేమ పథకాలు, చట్టాలు తీసుకొచ్చిందన్నారు. ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, మునినాయక్, పాండునాయక్, సక్రునాయక్, నరేందర్‌నాయక్, స్వామినాయక్, చందునాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సాగర్‌కు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి

నాగార్జునసాగర్‌లో నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క హాజరుకానున్నారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి హెలికాప్టర్‌లో శనివారం సాగర్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగిస్తారు. డిప్యూటీ సీఎం, మంత్రుల పర్యటనను విజయవంతం చేయాలని ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ కోరారు.

రేపు నల్లగొండలో బీఆర్ఎస్ మహాధర్నా

- మాజీమంత్రి కేటీఆర్ రాక

నల్లగొండ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రైతుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక వైఖరికి నిరసనగా ఈ నెల 12వ తేదీన జిల్లాకేంద్రంలోని గడియారం సెంటర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం నిర్వహించే మహాధర్నాకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్, మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు.

గ్రామస్థులతో సమావేశమై.. పథకాలు తెలుసుకుని..



గ్రామస్థులతో కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి జయరాం

మిర్యాలగూడ రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామంలో కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి జయరాంతోపాటు తెలంగాణ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి కార్యాలయ అధికారులు సెల్వరాజు, నజీర్ శుక్రవారం పర్యటించారు. మాజీ సర్పంచ్ భోగవెల్లి వెంకటరమణచౌదరితో కలిసి గ్రామస్థాయి ఉద్యోగులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులతో సమావేశం నిర్వహించారు. స్వచ్ఛభారత్ నిర్వహణ, తడి, పొడిచెత్త నుంచి ఎరువుల తయారీ విధానం, వంటి అంశాల అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌బీఎం ప్రతినిధి మోహిద్, కార్యదర్శి భద్రయ్య ఉన్నారు.

ఇంటి పన్ను వంద శాతం వసూలు చేయాలి

దేవరకొండ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మున్సిపాలిటి పరిధిలోని ఆస్తిపన్నులు, నీటికుళాయిల బిల్లులు, వాణిజ్య లైసెన్స్ ఫీజులు వంద శాతం వసూలు చేయాలని దేవరకొండ మున్సిపల్ కమిషనర్ వై.సుదర్శన్ ఆదేశించారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో శుక్రవారం వివిధ విభాగాల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు చెత్తను రోడ్లపై వేయకుండా మునిసిపల్ సిబ్బందికి సహకరించాలన్నారు.దుకాణాల యజమానులు చెత్త వేయ కుండా చూసుకోవాలన్నారు. ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. సమావేశంలో మున్సిపల్ రెవెన్యూ అధికారి ఆరీఫ్, శానిటర్ ఇన్‌స్పెక్టర్ శంకర్, ఏఈ రాజు, ఏవో రాకేష్ పాల్గొన్నారు.

రోడ్డుపై బారీకేడ్లు ఏర్పాటు చేయాలి

హాలియా, జనవరి 10(ఆంధ్రజ్యోతి): హాలియా మున్సిపాలిటీ మిర్యాలగూడ రోడ్డులోని శ్రీ ఆంజనేయరైస్ మిల్లు నుంచి మీనాక్షి హోటల్ మధ్యలో డివైడర్, బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఏకే ఫౌండేషన్ చైర్మన్ కట్టెబోయిన అనిల్‌కుమార్ శుక్రవారం హాలియా ఎస్ఐ సతీష్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా డివైడర్, బారికేడ్లు, సైన్ బోర్డులను ఏర్పాటు కోసం రూ. 10వేల చెక్కు ఎస్ఐకు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు కోనాల శివయ్య, తుమ్మరగోటి రమేష్, మన్నెం కోటి, రావుల రాముయాదవ్, అనిల్, శివ పాల్గొన్నారు.

కక్ష సాధింపు రాజకీయాలు మానుకోవాలి


విలేకరులతో మాట్లాడుతున్న చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

మిర్యాలగూడ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్ర జ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి కక్ష సాధింపు రాజకీయాలు మానుకోని రైతుల అభివృద్ధి కోసం పాటుపడాలని రైతు బంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇప్పటివరకు రూ.2 లక్షల రుణ మాఫీ కేవలం 35శాతం మందికే వర్తింపచేశారని, అలాగే రైతు భరోసాను ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. గత వానాకాలం, వేసవికాలం రెండు సీజన్లకు కలిపి రూ.12 వేలను రైతుల ఖాతాల్లో జమ చేయాలని, రైతు బీమాను అమలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. మాజీ సీఎం కేసీఆర్ స్వతహాగా రైతు కాబట్టి వారి బాధలను అర్థం చేసుకోని రైతు బంధు, రైతు బీమా పథకాలను విజయవంతంగా అమలు చేశారని అన్నారు.

కాంగ్రెస్ హామీలను ప్రశ్నిస్తున్నందుకే అక్రమ కేసులు : బీఆర్ఎస్

వేములపల్లి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు కోసం ప్రశ్నిస్తున్నందుకే ప్రభుత్వం కేటీఆర్‌పై అక్రమంగా కేసులు పెట్టడానికి యత్నిస్తుందని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కట్టా మల్లేష్‌గౌడ్ ఆరోపించారు. మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పి పుచ్చుకునేందుకే కేటీఆర్ అరెస్టుకు పూనుకుంటున్నారని అన్నారు. దీంతో రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులపై తీవ్ర ప్రభా వం చూపుతుందని, తెలంగాణ అభివృద్ధి సైతం కుంటుపడుతున్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించకపోవడం బాధాకరమన్నారు. సమావేశంలో మజ్జిగపు సుధాకర్ రెడ్డి, కాట్రగడ్డ రాజగోపాల్‌రావు, పెద్దపంగ సైదులు, నక్క నాగరాజు, శ్రీధర్, కుమార్, రాంబాబు, చిన లింగారెడ్డి, బంటు రాము, వెంకటయ్య, శ్రీను, జానకిరాంరెడ్డి, వేణు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

కొండమల్లేపల్లి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా మండలంలోని వర్ధమానిగూడెం సీల్యాతండా వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం స్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలునాయక్, మాజీ రవీంద్రకుమార్ వేర్వేరుగా పాల్గొని పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సిరాజ్‌ఖాన్, పీఏసీఎస్ చైర్మన్ డాక్టర్ వేణుధర్‌రెడ్డి, వేమన్‌రెడ్డి, రేఖా శ్రీధర్‌రెడ్డి, మేకల శ్రీనివాస్‌యాదవ్, గోవిందుయాదవ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నీలం శ్రీనివాస్‌యాదవ్, యుగంధర్‌రెడ్డి, మంగ్యనాయక్, కుంభం శ్రీనివాస్‌రెడ్డి, కోట్లజగదీశ్ రమావత్ దస్రూనాయక్, రమావత్ తులసీ రాం, పరమేష్‌యాదవ్ శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

శాసనమండలి గుత్తా సుఖేందర్‌రెడ్డి నివాళి


బుచ్చమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సుఖేందర్‌రెడ్డి

చింతపల్లి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని వింజమూర్ గ్రామానికి చెందిన దొంతం అలివేలు సంజీవరెడ్డి(మాల్ మార్కెట్ వై ర్మన్) తల్లి ఇటీవల్ల మృతి చెందారు. వింజమూర్‌లో శుక్రవారం నిర వ్హించిన దశదిన కర్మకు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పాల్గొని చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్, మాస భాస్కర్, గుండ్లపల్లి నర్సిరెడ్డి, ఈరటి మల్లేష్‌యాదవ్, కిరణ్‌కుమార్ రెడ్డి, ఆశోక్, పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

హాలియా, జనవరి 10(ఆంధ్రజ్యోతి): గర్భిణులు బాలింతలు, సంపూర్ణ ఆరోగ్యం కోసం పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీవో ఉదయశ్రీ సూచించారు. శుక్రవారం అనుముల ప్రాజెక్టు హాలియా మండలంలోని కొత్తపల్లి గ్రామంలోని రైతు వేదికలో అంగన్‌వాడీ టీచర్లకు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పిల్లలకు అక్షరాభ్యాసంతో పాటు ఆటపాటలు, వివిధ అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీవో సువర్ణ, ప్రాజెక్ట్ సూపర్‌వైజర్స్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

తులాభారం


వైకుంఠ ఏకాదశి పర్వ దినం సందర్భంగా భువనగిరి పట్టణ సమీపంలోని స్వర్ణగిరి ఆలయాన్ని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో బెల్లంతో తులాభారం వేయించుకున్నారు.

నర్సింగ్ కళాశాల ఏర్పాటుపై సందిగ్ధం

రాష్ట్రంలో 100 పడకల దవాఖానా ఉన్న ప్రతి చోట నర్సింగ్ కళాశాలలను ఏర్పాటు చేయాలని గతేడాది జనవరి 2న ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో నాగార్జునసాగర్‌లో కూడా కమలా నెహ్రూ దవాఖానాకు అనుబంధంగా నర్సింగ్ కళాశాల ఏర్పాటవుతుందని స్థానికులు ఆశగా ఎదురు చూశారు. కానీ ఏడాది గడుస్తున్నా నేటికీ నర్సింగ్ కళాశాలల ఊసే ప్రభుత్వం ఎత్తకపోవడంతో సంది గ్ధం పరిస్థితి నెలకొంది. (నాగార్జునసాగర్ -ఆంధ్రజ్యోతి)



నిరుపయోగంగా ఉన్న పాత ఆసుపత్రి భవనం

నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో డ్యామ్ నిర్మాణ సమయంలో ఇక్కడ పనిచేసే ఉద్యోగుల, కూలీల కోసం ఆరు దశాబ్దాల క్రితం నాటి ప్రధాని నెహ్రూ సతీమణి పేరున కమలా నెహ్రూ ఏరియా ఆసుపత్రిని నిర్మించారు. ఈ ఆసుపత్రి నల్లగొండ, గుంటూరు, ఖమ్మం, వరంగల్, మహబూబ్‌నగర్, ప్రకాశం తదితర జిల్లాల నుంచి వచ్చి రోగులు వైద్యం చేయించుకునే వారు. అలాగే ఈ ఆసుపత్రిలో 1992వ సంవత్సరంలో వితంతువులు, అనాథ మహిళలకు ఉపాధి కోసం శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేసి నిర్వహించారు. ఈ కళాశాలలో సంవత్సరానికి 30 సీట్ల చొప్పున మహిళలకు నర్సింగ్ విద్యను అందించేవారు. అనంతరం కళాశాలలో సిబ్బంది తదితర సమస్యలతో మూడేళ్ల తర్వాత కళాశాలను తీసివేశారు. దీంతో అప్పటి నుంచి ఈ ప్రాంత మహిళలు, బాలికలునర్సింగ్ విద్య కోసం హైదరాబాద్, నల్లగొండ, ఖమ్మం, సూర్యాపేట వరంగల్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అయితే పాత ఆసుపత్రి భవనం పక్కనే ఉన్న ఖాళీ ప్రదేశంలో రూ.18 కోట్లతో నూతన ఆసుపత్రి భవనాన్ని 2019లో నిర్మించారు. అప్పటి నుంచి కొత్త భవనంలోనే వైద్య సేవలు అందిస్తున్నారు. పాత ఆసుపత్రి భవనం నిరుయోగంగా ఉంది. ప్రస్తుతం ఖాళీగా ఉన్న పాత ఆసుపత్రి భవనంలో నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. సాగర్‌లో నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేయడం వల్ల మధ్యలో విద్య మానేసిన మహిళలకు చదువుకునే అవకాశం లభించడమే కాకుండా వారికి ప్రభుత్వ పరంగానో లేదా ప్రైవేటు పరంగా కానీ ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇక్కడ నర్సింగ్ కళాశాలలో పనిచేసిన నలుగురు నర్సింగ్ ట్యూటర్లు ప్రస్తుతం కూడా సాగర్ ఆసుపత్రి నుంచే వేతనాలు తీసుకుంటున్నారు. సాగర్ నుంచి వేతనం పొందుతూ హైదరాబాద్‌లో ఉస్మా నియా గాంధీ, నీలోఫర్ దవాఖానాల్లో కళాశాలలో డిప్యూటేషన్‌పై ట్యూటర్లుగా పనిచేస్తున్నారు.

64 నర్సింగ్ కళాశాలల ఏర్పాటుకు ఆదేశాలు...

రాష్ట్రంలో నర్సుల కొరత నేపథ్యంలో రాష్ట్రంలో కొత్తగా మరో 64 నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి సంబంధిత శాఖకు ఆదేశాలు జారీ చేశారు. 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఉన్న ప్రతి చోట నర్సింగ్ కళాశాలలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తుంది. దీంతో సాగర్ హిల్‌కాలనీలో కమలా నెహ్రూ ఏరియా ఆసుపత్రి పాత భవనంలో గతంలో మాదిరిగా నర్సింగ్ కళాశాలను ఏర్పాటవుతుందని స్థానికులు ఆశిస్తున్నారు.సాగర్ చుట్టు పక్కల ఉన్న సుమారు 35 తండాలకు చెందిన కృష్ణపట్టె పరిధిలో గిరిజన యువతులు విద్యార్థినుల్లో తాము నర్సింగ్ విద్యను అభ్యసించే అవకాశం ఉంటుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వెంటాడుతున్న నర్సుల కొరత

కొవిడ్ సమయంలో నర్సులకు విపరీతంగా డిమాండ్ పెరిగింది. ఆరోగ్య శాఖ నిబంధనల ప్రకారం ప్రతి వంద పడకల ఆసుపత్రిలో 45 మంది నర్సులు ఉండాలి. కానీ ప్రస్తుతం 25 మంది మాత్రమే అందుబాటులో ఉన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 22 ప్రభుత్వ, 78 వరకు ప్రైవేటు నర్సింగ్ కళాశాలలు ఉండగా మొత్తం 3,150 నర్సింగ్ సీట్లు రాష్ట్రంలో అందుబాటులో ఉన్నాయి.

ప్రభుత్వం అనుమతిస్తే సిద్ధంగా ఉన్నాం



సాగర్ ఆసుపత్రిలో నర్సింగ్ కళాశాలను నిర్వహించడానికి ప్రభుత్వం అనుమతిస్తే నడపడానికి సిద్ధంగా ఉన్నాం. ఇక్కడ నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేయడానికి ట్యూ టర్లు కూడా ఉన్నారు. వారు డిప్యూటేషన్‌పై హైద రాబాద్‌లో ఉన్నారు. వారిని ఇక్కడికు రప్పిస్తాం. భవనం కూడా అందుబాటులో ఉంది. -డాక్టర్ భానుప్రసాద్ నాయక్, ఆర్ఎంవో

నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేస్తే బాగుంటుంది



సాగర్ కమలా నెహ్రూ ఏరియా ఆసుపత్రిలో నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేస్తే ఇక్కడ మహిళలకు, బాలికలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.అంతే కాకు ండా గతంలో కళాశాలను నిర్వహించారు కాబట్టి ప్రస్తుతం నిర్వహించడానికి ఎలాం టి ఇబ్బందులు లేవు. ప్రభుత్వ నిర్ణయం బాగుంది. -చర్క యాదగిరి, సామాజిక కార్యకర్త

మాదిగల మహాగర్జన సభను విజయవంతం చేయాలి

దేవరకొండ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ఈనెల 19న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జరిగే బహిరంగసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ దేవరకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి పోతెం సహదేవుడు, జాతీయ నాయకులు కంబాలపల్లి వెంకటయ్య కోరారు. స్థానిక రహదారిబంగ్లాలో మహాగర్జన వాల్‌పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి యేసయ్య, ఎర్ర యాదగిరి, సీతయ్య, మాతంగి శ్రీను, పొట్ల ప్రభు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

కొండమల్లేపల్లి, జనవరి 10(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో కొండమల్లేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి భూతరాజు సాయి వర్షిత్ ప్రతిభ కనబర్చిచాడు. మహబూబ్ నగర్‌లో జరిగిన సేంద్రియ వ్యవసాయ అంశంపై ఎగ్జిబిట్ ప్రదర్శించారు. ఈ సందర్భంగా శుక్రవారం విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించి ప్రశంసా పత్రం అందజేశారు. శాలువాతో సన్మానించారు.

అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పిస్తాం


దేవరకొండ డిపో నుంచి యాపలబాయితండాకు బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు రోడ్లు, బస్సు సౌకర్యం కల్పించడానికి కృషి చేస్తానని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ తెలిపారు. వైకుంఠ ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని శుక్రవారం దేవరకొండ నుంచి చందంపేట మండలం యాపలబాయితండాకు బస్సును ప్రారంభించి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.దేవరకొండ డిపో ఆదా యంలో రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలవడం అభినం దనీయమన్నారు. కార్యక్రమంలో ఆర్ఎం శివ శంకర్, మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, అసిస్టెంట్ మేనేజర్ సైదులు, చందంపేట మాజీ ఎంపీపీ గోవిందు, మారుపాకల సురేష్‌గౌడ్, శిరందాసు కృష్ణయ్య పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు క్రమబద్ధీకరించుకోవాలి

మిర్యాలగూడ టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారు లు తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలని మునిసిపల్ కమిషనర్ ఎండీ. యూసుఫ్ కోరారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. పట్టణ పరిధిలో 14,328 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు రాగా 190 దరఖాస్తులు ఆమోదం పొందాయన్నారు. 2,027 దరఖాస్తుల్లో తప్పులుండగా, 1,877 దరఖాస్తులు అసంపూర్తిగా ఉన్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు క్రమబద్ధీకరణతో రూ. 1.74 కోట్ల ఆదాయం సమకూరిందన్నారు.

గొడుకొండ్ల పాఠశాల హెచ్‌ఎంగా కృష్ణవేణి

చింతపల్లి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటేశ్వరనగర్(గొడుకొండ్ల) జడ్పీహెచ్ఎస్‌లోనే పనిచేస్తున్న కృష్ణవేణిని హెచ్‌ఎంగా నియమిస్తూ జిల్లా విద్యాధికారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న కృష్ణవేణిని పర్మనెంట్‌గా చేయాలని కోరుతూ టీపీయూఎస్ ఆధ్వర్యంలో డైరెక్టర్‌కి ఏప్రిల్ లో వినతి పత్రం అందజేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి క్షేత్రస్థాయిలో పరిశీలించి కృష్ణవేణిని హెచ్‌ఎంగా నియమించడంపై సంఘం మండలాధ్యక్షుడు సొనగంటి వేణు గోపాల్ హర్షం వ్యక్తం చేశారు.

'ప్రజాపాలన' దరఖాస్తులను పరిష్కరించాలి

డిండి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని ఏఐవైఎఫ్ మండలాధ్యక్షుడు ఎలిమినేటి నరేష్ శుక్రవారం ఆయన ప్రకటనలో అన్నారు. ప్రజాపాలన ఇచ్చిన దరఖాస్తులు ఆన్‌లైన్ కాకపోవడంతో మండల ప్రజలు ఎంపీడీవో కార్యాలయం చుట్టు తిరుగుతున్నారని తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో మరోసారి దరఖాస్తులు చేసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశం మేరకు ప్రజలు రెండోసారి దరఖాస్తులు చేసుకున్నప్పటికి ఆన్ లైన్ కాకపోవడంతో కార్యాలయం చుట్టు తిరుగుతున్నారు.

భూమి లేని పేదలకు రూ.12వేలు ఇవ్వాలి

దేవరకొండ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): భూమిలేని పేదలకు ప్రభుత్వం నెలకు రూ.12 వేలు అందజేసి ఉపాధిహామీ జాబ్ కార్డు అందజేసి పని కల్పించాలని వ్యవ సాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్య దర్శి బొలుగూరు నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఆ సంఘం దేవరకొండ నియో జకవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఎన్ని కలకు ముందు ఇచ్చిన హమీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మొగిలి వెంగలయ్య, ఎలిమినేటి హుస్సేన్, బుచ్చయ్య, శంకర్‌నాయక్, లాలయ్య, బక్కయ్య, పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సహకరించాలి



విద్యార్థులకు టై, బెల్ట్‌లను అందజేస్తున్న సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్

మిర్యాలగూడ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు సహకరించాలని మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ ఎం.నారాయణ అమిత్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మినీ గ్రీన్ గార్డెన్ ప్రారంభించారు. అనంతరం దాతల సహకారంతో విద్యార్థులకు టై, బెల్ట్, బ్యాడ్జీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తుందన్నారు. మినిగ్రీన్ గార్డెన్ కు రెండు మోటార్లు ఏర్పాటుకు రూ. 40వేలు, గేటు ఏర్పాటుకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కుర్ర క్రాంతి- కృష్ణకాంత్‌నాయక్ 16 వేలు, సూర్య రామారావు డయాగ్నస్టిక్, కృష్ణకాంత్ నాయక్, ఆర్థో డా.శ్రీనివాసరెడ్డి సంయుక్తంగా టై, బెల్ట్, బ్యాడ్జీల కోసం 45 వేలు, మైక్ కోసం జీహెచ్‌ఎం పరుశరాములు, ఎస్ఏ శారదాబాయి, పిడి జనార్ధన్‌రెడ్డిలు కలిసి రూ. 15 వేలు, వాకర్స్ అసోసియేషన్ గుడపురి లక్ష్మణ్, వెంకటేశ్వర్లు ద్వారా 50 మొక్కలు, మినరల్ ప్లాంట్ రిపేర్‌కు నూతన ఉపాధ్యాయులు జానయ్య, లక్ష్మయ్య, స్వామీ, మీనా, జంగయ్య, భవానిలు రూ. 30 వేలు ఆర్థిక సహాయం చేయగా వేదికపై వారిని సబ్‌కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ధర్మానాయక్, తహసీల్దార్ హరిబాబు, ఎంఈఓ బాలునాయక్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు నర్సిరెడ్డి, రవినాయక్, పీఏసీఎస్ చైర్‌పర్సన్ భవాని, ఉపాధ్యాయులు కృష్ణకాంత్, ఉపేందర్, ముంతాజ్‌బేగం, థావుర్యా, సంతోష్, అనిత, జ్యోతిమీనా, భవాని, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి పూజలు


నిడమనూరు : ముప్పారంలో స్వామి వారి పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు

దేవరకొండ , నిడమనూరు, కొండమల్లేపల్లి, మిర్యాలగూడ రూరల్ జనవరి 10(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి పర్వదినం శుక్రవారం దేవరకొండ, మిర్యాలగూడ, నాగార్జునసాగర్ నియోజకవర్గాల్లో ప్రజలు వైభవంగా నిర్వహించుకున్నారు. అన్ని ఆలయాల్లో తెల్ల వారుజాము నుంచి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కలిగించారు. దేవరకొండ గరుడాద్రి వేంకటే శ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే బాలునాయక్ ఉత్తర ద్వారా దర్శనాలు చేసుకొని ఆలయంలో ఆలయ కమిటీ నిర్వా హకు లు, నాయకులతో కలిసి పూజలు చేశారు. నిడమనూరు మండలం ముప్పారం గ్రామ ప్రాచీన వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు ఉత్తరద్వార దర్శనం కలిగించారు. స్వామివారిని పల్లకి సేవలో ఘనంగా ఊరేగించారు. కొండ మల్లేపల్లి మండల కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులోని మల్లెల గట్టుపై ఉన్న శ్రీ గోదా వే ంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్ర వారం ఉత్తర ద్వారం గుండా స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. మిర్యాలగూడ మండలం అవంతీపురం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయంలో తహసీల్దార్ హరిబాబు పూజాలో పాల్గొన్నారు. యాద్గార్‌పల్లి శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి, పార్వతి వర్ధిని సమేత అగస్త్యేశ్వరస్వామి ఆల యంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మమత దంపతులు పూజలు చేశారు.

నేడు సాగర్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటన

నాగార్జునసాగర్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు స్పిల్‌వేపై పడిన గుంతలను రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శనివారం పరిశీలించనున్నారు. స్పిల్‌వే మరమ్మతులు చేసి ఏడాదిన్నరకే మళ్లీ గుంతలు పడటంతో 'సాగర్ స్పిల్‌వే పై మళ్లీ గుంతలు' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఈ నెల 2వ తేదీన కథనం ప్రచురించింది. దీంతో ఈ నెల 4వ తేదీన స్పిల్‌వేను సీడబ్ల్యూసీ కేఆర్ఎంబీ సభ్యులు పరిశీలించారు. నివేదికలు ఈఎన్‌సీకి అందజేయడంతో ఈ నెల 7వ తేదీన హైదరాబాద్‌లో జలసౌధలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో సాగర్ స్పిల్‌వే గుంతలు పుడ్చడానికి చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. అలాగే సాగర్‌లో నిర్వహి స్తున్న గిరిజన ఆదివాసీ కాంగ్రెస్ ప్రతినిధుల శిక్షణ తరగతుల్లో పాల్గొననున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం

● రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండారెడ్డి


కుంకుడుకాయలతో తయారు చేసిన వస్తువుల విక్రయాన్ని ప్రారంభిస్తున్న కోదండారెడ్డి, ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, జనవరి10(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండారెడ్డి అన్నారు. స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే బాలు నాయక్‌తో కలిసి శుక్రవారం పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో రైతు లోకసాని పద్మారెడ్డి కుంకుడుకాయలు, ఇతర ప్రకృతి ఉత్పత్తులతో తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించి మాట్లాడారు. రైతు పద్మారెడ్డి ప్రకృతి ఉత్పత్తులతో షాంపులు, డిష్‌వాషర్, హ్యాండ్‌వాష్, వ్యవసాయానికి ఫర్టిలైజర్ తయారు చేయడం అభి నందనీయమన్నారు. పాలమూరు ఎత్తిపోతల పథకం ద్వారా ఎదుళ్ల నుంచి డిండి ప్రాజెక్టుకు నీటిని తీసుకురావడం కోసం మంత్రివర్గం ఆమోదించినట్లు తెలిపారు. రైతు భరోసా పెట్టు బడి సాయం సంక్రాంతి నాటికి రైతుల ఖాతాల్లో రూ.6వేలు జమ చేయ నున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మేరెడ్డి శ్యాంప్ర సాద్‌రెడ్డి, దామో దర్‌రెడ్డి, వ్యవసాయ కమిషన్ సభ్యులు కేవీఎన్ రెడ్డి, లింగారెడ్డి, బ్రహ్మశ్రీ సూర్యనారాయణస్వామి, శ్రవణ్ కుమార్, పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న డీటీసీ వాణి

మాడ్గులపల్లి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించి తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని డీటీసీ వాణి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అద్దంకి- నార్కట్‌పల్లి రహదారిపై గల టోల్‌గేట్ వద్ద వాహనదారులకు రోడ్డు భద్రతపై ఆమె అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. అతి వేగంగా వాహనాలను నడిపి ప్రాణాలమీదకు తెచ్చుకోవద్దని, మిమ్మ ల్ని నమ్ముకొని ఇంటి వద్ద కుటుంబసభ్యులు ఎదురుచూస్తుంటారని, వాహనాలను నెమ్మదిగా నడిపి తమ గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ లావణ్య, స్వప్న, మల్లికార్జున్, చంద్రశేఖర్, సోని, ప్రియా, సిబ్బంది ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

హాలియా,(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని హాలియా సీఐ జనార్దన్ గౌడ్ అన్నారు. స్థానిక టైమ్ స్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్ రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ప్రధాన సెంటర్‌లో ట్రాఫిక్ రూల్స్ అవగాహన వచ్చే విధంగా నాటక, నృత్య